

బీసీ సభ నిర్వహణకు జరుగుతున్న ఏర్పాట్లు

నేడు జయహో బీసీ సభ

- ఏఎన్‌యూ ఎదుట సభా ప్రాంగణం
- హాజరుకానున్న టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్
- జాతీయస్థాయిలో బీసీల డిక్లరేషన్ విడుదల చేయనున్న నేతలు
- ఏర్పాట్లను పర్యవేక్షించిన టీడీపీ రాష్ట్ర నేతలు

పెదకాకాని, మార్చి 4: తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీలు తలపెట్టిన జయహో బీసీ భారీ బహిరంగ సభకు పెద్ద ఎత్తున ఏర్పాట్లను చేపట్టారు. గుంటూరు విజయవాడ మధ్య ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట గల సువిశాల ప్రాంగణంలో సభను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇరు పార్టీలకు చెందిన బీసీలు సుమారు మూడు లక్షల మందికి పైగా తరలివస్తారని టీడీపీ నాయకులు తెలిపారు. విశ్వవిద్యాలయ ఎదురు గల ప్రాంగణంలో సభా వేదికను భారీగా నిర్మించారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌లు ఈ సభలో పాల్గొననున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం జగన్ మోహన్‌రెడ్డి బీసీలకు చేస్తున్న అన్యాయాన్ని వివరిస్తూ జాతీయస్థాయిలో బీసీలకు ప్రయోజనం చేకూరే విధంగా బీసీ డిక్లరేషన్ ప్రకటించనున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే విధివిధానాలు తయారు చేసినట్లు ఆ పార్టీ నాయకులు అచ్చెన్నాయుడు, రవీంద్రలు తెలిపారు. శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు పెద్దఎత్తున టీడీపీ, జనసేన బీసీ శ్రేణులు తరలివస్తారని భావిస్తున్న నాయకులు భారీ ఏర్పాట్లను చేపట్టారు. సభా ప్రాంగణం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

ఏర్పాట్లను పర్యవేక్షించిన నాయకులు

బీసీ బహిరంగ సభ ఏర్పాట్లను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, మాజీమంత్రి కొల్లు రవీంద్ర, రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు తదితరులు పర్యవేక్షించారు. సభా ప్రాంగణాన్ని పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సభ ప్రాంగణానికి ఎదురుగా ఎల్ఈడీ టీవీలను ఏర్పాటు చేస్తున్నారు.



ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎమ్మెల్యే అనగాని, సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి రవీంద్ర




జగన్ బీసీలకు తీరని ద్రోహం చేశారు.. మాజీ మంత్రి అచ్చెన్నాయుడు

జగన్మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాత బీసీలకు తీరని ద్రోహం చేశారని మాజీ మంత్రి, టీడీపీ ఏపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆరోపించారు. సోమవారం జయహో బీసీ సభ ఏర్పాట్ల పర్యవేక్షణ అనంతరం ఆయన కొద్దిసేపు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో బీసీలపై జరుగుతున్న దాడులు, దారుణాలు అన్నీ ఇన్నీ కాదన్నారు. బీసీల పట్ల ముఖ్యమంత్రి జగన్‌కు చిత్తశుద్ధి లేదన్నారు. రాష్ట్రంలో ఎందరో బీసీలను పొట్టన పెట్టుకున్న ఘనత జగన్ దే అని అన్నారు. రాష్ట్రవ్యాప్తం గా వందలాది మంది బీసీలను హతమార్చిన దుర్మార్గుడు జగన్ అని మండిపడ్డారు. తెలుగుదేశం హయాంలో ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలను జగన్ పక్కన పడేశారన్నారు. బీసీలను అన్ని విధాల మోసం చేసిన జగన్‌కు బీసీలు తగిన బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు.

బీసీల ద్రోహి జగన్మోహన్‌రెడ్డి: మాజీ మంత్రి కొల్లు రవీంద్ర

రాష్ట్రంలో అబద్ధాలు, తప్పుడు మేనిఫెస్టో పెట్టి అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ బీసీల ద్రోహిగా మారారని మాజీమంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. సోమవారం జయహో బీసీ ప్రాంగణం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. జయహో బీసీ సభలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌లు పాల్గొని ఉమ్మడిగా జాతీయ స్థాయిలో బీసీల డిక్లరేషన్ ప్రకటిస్తారని తెలిపారు. గత ఐదేళ్లుగా రాష్ట్రంలో బీసీలు అన్ని రంగాల్లో అణగ దొక్కబడ్డారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 75 వేల కోట్ల రూపాయల బీసీల కార్పొరేషన్ రుణాలను ఎత్తివేసిన ఘనుడు జగనన్నారు. బీసీల మధ్య ఐక్యత లేకుండా చేస్తూ కార్పొరేషన్లు గా విభజించారని, కేవలం పదవులు మాత్రమే ఇచ్చారు కానీ ఒక్క రూపాయి నిధులు కూడా మంజూరు చేయలేదని అన్నారు. కేవలం ఉత్సవ విగ్రహాలుగా మాత్రమే బీసీలు మిగిలిపోయారని తెలిపారు. రాష్ట్రంలో బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టేందుకు, తెలుగుదేశం పార్టీలో బీసీలకు జరిగిన ప్రయోజనాలను వివరిస్తూ జాతీయస్థాయిలో బీసీ డిక్లరేషన్‌ను ప్రకటిస్తారని తెలిపారు.



- వైసీపీలో సమన్వయకర్తలకు సీటు విషయంలో దక్కని భరోసా
- ఇన్‌చార్జిలుగా నియామకమే తప్ప ఫైనల్ కాదంటున్న అధిష్ఠానం
- తాజాగా పార్టీ చేపట్టిన మార్పులతో కొరవడిన ధీమా
- అయోమయంలో వైసీపీ.. కాడి వదిలేస్తున్న ఇన్‌చార్జిలు

నెలల తరబడి సర్వేలు చేయించాం.. ప్రజల్లో అభిప్రాయ సేకరణ జరిపాం.. పరిస్థితులేవీ అనుకూలంగా లేనందున మరొకరికి సమన్వయకర్తగా అవకాశమిస్తున్నాం.. సహకరించాలి.. ఆయా నియోజకవర్గాల్లో ఇన్‌చార్జిల మార్పు ప్రక్రియ చేపట్టే సందర్భంలో పార్టీ పెద్దలు గతంలో చెప్పిన మాటలివి. అప్పటి నుంచి అసమ్మతి స్వరాలు, అలకలు, రాజీనామాలు పాలకపార్టీలో కొనసాగుతూనే ఉన్నాయి. ఈ అసమ్మతి జ్వాలలు చల్లారకముందే కొత్తగా నియమించిన వారి విషయంలో గ్యారెంటీ లేదనే లీకులను వైసీపీ ఇస్తోంది. వారిని ఆయా నియోజకవర్గాల్లో సమన్వయకర్తలుగా నియమించాం తప్పితే అదే ఫైనల్ కాదనే పొంతనలేని ప్రకటనలను వైసీపీ పెద్దలు చేస్తున్నారు. కొత్త ఇన్‌చార్జిలను నియమించిన చోట మళ్లీ మార్పులు చేపడుతుండడంతో ఇక్కడ నేతలకు ధీమా కరువైంది. ఇది వైసీపీలోని అయోమయ స్థితికి అద్దం పడుతోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

బాపట్ల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అధికార వైసీపీలో ఇన్‌చార్జిల మార్పు ఓ ప్రహసనంగా మారింది. ఇన్‌చార్జిల మార్పు చేపట్టిన బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఏ ఒక్క చోటా కొత్తపాత నాయకులు ఏకతాటి మీద నడవడం లేదు. పైగా ద్వితీయశ్రేణి నాయకులు ఇప్పటికీ నిత్యం తాడేపల్లి గడప ఎక్కుతూ కొత్త ఇన్‌చార్జిలపై తమ అసంతృప్తిని వెలిబుచ్చుతూనే ఉన్నారు. వీరికి తెర వెనక మాజీ నాయకుల సహకారం ఉండడం గమనార్హం. రేపల్లెలో వైసీపీ నియమించిన ఈవూరు గణేష్‌కు నేటికీ పార్టీ శ్రేణుల నుంచి కనీసస్థాయిలో కూడా సహకారం దక్కకపోవడం వైసీపీలోని గందరగోళ స్థితికి ఓ ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

మళ్లీ సర్వేల పరంపర..

ఇన్‌చార్జిల మార్పు నిర్ణయం చేపట్టేటప్పుడు వీళ్లే ఆయా సీట్లకు తుది ఎంపిక అవుతారనే విధంగా వైసీపీ కలరింగ్ ఇచ్చింది. సీన్ కట్ చేస్తే తనకు అలవాటైన రీతిలో తూచ్ అనేస్తూ నాలుక మడతేసింది. మళ్లీ సర్వేలు చేపడుతున్నామని, నియోజకవర్గాల్లో శ్రేణులనుంచి అభిప్రాయాన్ని తాజాగా సేకరిస్తున్నామని ఆ తర్వాతే ఫైనల్‌గా అభ్యర్థి ఖరారు ఉంటుందని తాజాగా వైసీపీ సెలవిస్తుండడంతో అవాక్కవడం సదరు నేతల వంతవుతోంది. దీంతో అట్టహాసంగా ఆయా నియోజకవర్గాల్లోకి రంగప్రవేశం చేసిన సమన్వయకర్తలు పార్టీ చేస్తున్న పొంతనలేని ప్రకటనలతో తలలు పట్టుకుంటున్నారు.

తాజా మార్పులతో మరింత బెంబేలు..

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని మంగళగిరి, పొన్నూరుతో పాటు గుంటూరు పార్లమెంట్ విషయంలో పార్టీ వేసిన పిల్లిమొగ్గలు ఇన్‌చార్జిలను మరింత గందరగోళంలో పడేశాయి. మంగళగిరి విషయంలో ఒకటికి రెండుసార్లు మాట మార్చడం ఒక ఎత్తయితే గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి విషయంలో వైసీపీ చేపట్టిన మార్పులను చూసేసరికి తమ పరిస్థితి కూడా ఇంతేనన్న నైరాశ్యంలో సదరు నేతలు మునిగిపోయారు.

ఏ ప్రకటనా వెలువడని వారిది మరో వ్యథ..

నియోజకవర్గాల్లో కొత్తగా సమన్వయకర్తలుగా వచ్చిన వారి సీటు ఖరారు విషయంలో ఓ తంతు నడుస్తుంటే, పాలకపార్టీలో ఇప్పటికే ఎమ్మెల్యేలుగా కొనసాగుతూ అధికారికంగా ఎటువంటి ప్రకటన రాని వారిది మరో వ్యథ. రోజుకో సర్వే పూటకో అభ్యర్థి పేరుతో వారి గుండెల్లో కూడా వైసీపీ రైళ్లు పరిగెత్తిస్తోంది. మొత్తంగా చూస్తే పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో ఈ సీటు తనదే అని నమ్మకంగా చెప్పగలిగే సాహసాన్ని వైసీపీ అభ్యర్థులు చేయలేకపోవడం పార్టీలో కొనసాగుతున్న అయోమయ స్థితికి నిదర్శనంగా చెప్పవచ్చు.

అభ్యర్థుల కోసం పక్కచూపులు..

గెలుపు విషయంలో ధీమా సంగతి దేవుడెరుగు కనీసం సమర్థులైన అభ్యర్థులు దొరక్క రోజుకో ప్రకటనతో కాలం వెళ్లదీయాల్సిన దీనస్థితిని వైసీపీ ఎదుర్కొంటుందని టీడీపీ ఆరోపిస్తోంది. ఇన్నాళ్లు బీరాలు పలికిన పాలక పార్టీ ఎన్నికలు దగ్గర పడే కొద్దీ సొంత నేతల వీం ద ... నమ్మకం లేక తమ పార్టీ నేతలకు వలవేసే పనిలో నిమగ్నమైందని టీడీపీ నేతలు విమర్శిస్తున్నారు. మునిగిపోయే నావలోకి వెళ్లడానికి ఎవరూ సుముఖంగా లేకపోవడంతో కింకర్తవ్యం ఏమిటో తెలియక అభ్యర్థిత్వాల విషయంలో సర్వేల పేరిట వైసీపీ కాలయాపన చేస్తోందని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు.

ప్రకటించాక చూసుకుందాంలే..

ఇన్‌చార్జిల మార్పు విషయంలో వైసీపీ వేస్తున్న చిందులను చూసి అధికారికంగా తమ పేరు ప్రకటించాక ఆలోచిద్దాంలే అన్న ధోరణికి సదరు నేతలు వచ్చినట్లు తెలుస్తోంది. వైసీపీకి చెందిన ఓ కార్యకర్త తన సమస్యను చెప్పుకుందామని ఇటీవల మార్పు చేపట్టిన బాపట్ల జిల్లాలోని ఓ నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త వద్దకు వెళ్లగా తనకే సీటు విషయంలో గ్యారెంటీ లేదని తాను నీకేమీ చేయగలనని చేతులెత్తేయడంతో బిత్తరపోవడం ఆ కార్యకర్త వంతైంది. దాదాపు ప్రతి నియోజకవర్గంలో వైసీపీ ఇన్‌చార్జిలుగా చలామణి అవుతున్న నేతల తీరు ఇలానే ఉంటుంది. సీటు విషయంలో సరైన భరోసా దక్కకపోగా రోజుకో పేరు తెరమీదకు వస్తుండడం వారిని మరింత గందరగోళం లోకి నెట్టడంతో పాటు పార్టీలో పరిస్థితి అయోమయంగా ఉందనే వ్యాఖ్యానాలను సదరు నేతలే చేయడం గమనార్హం. మరో వైపు టీడీపీ మాత్రం విస్పష్ట ప్రకటనతో ఆయా నియోజకవర్గాలకు పోటీ పడే అభ్యర్థుల పేర్లను వెల్లడించడంతో వైసీపీ పని మరింత దిగజారిందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా
కార్యక్రమానికి హాజరైన అధికారులు



బాపట్ల, మార్చి 4: ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించటానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. ఎంసీసీ కమిటీలోని అధికారులకు సోమవారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో శిక్షణా కార్యక్రమం జరిగింది. కార్యక్రమాన్ని ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియామవళి అమల్లోకి రాగానే అధికారులు అప్రమత్తం కావాలని చెప్పారు. ఎన్నికల ప్రవర్తన నియామవళి మండలస్థాయిలో అమలు చేయాల్సిన బాధ్యత ఎంసీసీ కమిటీపై ఉందన్నారు. అధికారిక సమావేశాలు నిర్వహించరాదని ఏదైన ప్రారంభించే కార్యక్రమాలకు నిషేదం వర్తిస్తుందన్నారు. ఎన్నికల్లో పోటీచేసే పార్టీలు, ఆయా అభ్యర్థులకు సమాన అవకాశాలు ఎన్నికల కమిషన్ కల్పిస్తుందన్నారు. అభ్యర్థుల ప్రచారాలు, సభలు, సమావేశాలపై నిశిత పరిశీలన, నిఘా ఉంచాలన్నారు. ఆయా పార్టీలవారు వెచ్చిస్తున్న వాటిని, అభ్యర్థుల ఖర్చులను ఎప్పటికప్పుడు పరిశీలించి నమోదు చేయాలన్నారు. ముఖ్యంగా నగదు, వస్తువులు, ఇతర బహుమతులతో ఓటర్లను ప్రభావితం చేసే అవకాశం ఉందన్నారు. కుల, మతాలతో పలువురిని ప్రభావితం చేయటం నిబంధనలను ఉల్లంఘించటమే నన్నారు. ఆధ్యాత్మిక ప్రార్థన మందిరాల్లో అభ్యర్థులు సమావేశాలు నిర్వహించరాదన్నారు. ఇలాంటి వాటితో ప్రజలను ప్రలోభపెట్టే అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మండలస్థాయిలోని ఇతర కమిటీ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని ఆయన సూచించారు. ముందుగా జిల్లా ప్రణాళికాధికారి కె.శ్రీనివాసరావు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతారామయ్యలు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

మిర్చి ధర... పతనం

- గత వారంలో తేజా రకం క్వింటాలు రూ.21 వేలు
- ఈ వారం రూ.16 వేలే
- యార్డుకు వచ్చి గుల్ల అయ్యామంటున్న రైతులు
- ఆత్మహత్యలే శరణ్యమంటూ కన్నీళ్లు

గుంటూరు సిటీ, మార్చి 4: మిర్చి ధర భారీగా పతనమైంది. గత వారంతో పోలిస్తే ధరలో భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. వారం వ్యవధిలోనే క్వింటాలుకు రూ.5000 నుంచి రూ.7000 వరకు ధర తగ్గిపోయింది. గుంటూరు మిర్చి యార్డులో సోమవారం తేజా రకం రూ.14 వేల నుంచి రూ.16 వేల వరకు కొనుగోళ్లు జరిగాయి. మిగిలిన రకాల ధరలు ఇంకా పూర్తిగా తగ్గిపోయాయి. సార్కో రకం రూ.11 వేల నుంచి రూ.14 వేల వరకు కొనుగోళ్లు జరిగాయి. గత వారంలో ఇదే రకం రూ.16 వేల నుంచి రూ.20 వేల వరకు పలికింది. మొత్తం మీద అన్ని రకాల మిర్చి ధర బాగా తగ్గించి కొనుగోలు చేసేందుకు వ్యాపారులు మొగ్గు చూపుతున్నారు. సుమారు 5 లక్షల టిక్కీలు ఒకేసారి రావటంతో ధరను పూర్తిగా తగ్గించేశారని రైతులు వాపోతున్నారు. యార్డుకు తీసుకొస్తే రూపాయి ఎక్కువ వస్తుంది అనుకున్న రైతుల ఆశలు పూర్తిగా ఆవిరవుతున్నాయి. స్థానికంగానే ఎక్కువ ధరకు అడుగుతుండగా యార్డులోని వ్యాపారులు ధరను పాతాళానికి పడేశారని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న మిర్చి ధరలతో రైతులు అప్పుల పాలయ్యే పరిస్థితి ఉంది. కొందరు రైతులు ఆత్మహత్యలే శరణ్యమని కన్నీరు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతులను కదిలిస్తే కన్నీరు మున్నీరవుతున్నారు.





- అద్దంకి ఊరచెరువును వైసీపీ నేత ఆధ్వర్యంలో ఆక్రమించి వేస్తున్న ప్లాట్లు

బరితెగింపు

- అద్దంకిలో ఆక్రమణదారులకు వైసీపీ నేతల అండదండలు
- అధికారుల ఆదేశాలు బేఖాతర్
- ఎట్టకేలకు రంగంలోకి దిగిన రెవెన్యూ అధికారులు
- ఇకనైనా అడ్డుకట్టపడేనా..!

అద్దంకి, మార్చి4: అద్దంకి పట్టణంలో ఆక్రమణదారులు మరింత రెచ్చిపోతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అధికారుల బదిలీలు జరిగాయి. దీనిని అదునుగా తీసుకొని కొత్తగా వచ్చిన అధికారులు కుదుటపడే లోపే ప్రభుత్వ భూమిని తమ ఆధీనం లోకి తెచ్చుకునేందుకు వేగంగా పావులు కదుపుతున్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఏకంగా ప్లాట్లు వేస్తున్నా అధికారులు మొక్కుబడిగా మాటలు చెప్పటం మినహా క్షేత్రస్థాయిలో రంగంలోకి దిగిన దాఖలాలు అంతగా లేవు. ఆక్రమణదారులలో కొంతమంది అధికారపార్టీ నేతలు కావటం, మరికొన్ని చోట్ల ఆక్రమణదారులకు వైసీపీ నేతల అండదండలు పుష్కలంగా ఉండటంతో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. గత నెలరోజుల వ్యవధిలోనే ఉత్తర అద్దంకి రెవెన్యూ పరిధిలో ఊరచెరువు, ఆటోనగర్- నామ్ రోడ్డు మధ్య, అద్దంకి కొండ వద్ద ఆక్రమణలు మరింత పెరిగాయి. ఊరచెరువులో గత ఏడాది చెరువు అభివృద్ధి పనులు చేసే సమయంలోనే ముందు చూపుతో ఆక్రమణకు వీలున్నవరకు వదిలి కట్ట నిర్మాణం చేశారు. దీంతో చెరువులో సుమారు రెండు ఎకరాల భూమిని ఆక్రమించి ప్లాట్లుగా వేసేందుకు పని మరింత సులువైంది. ఓ వైసీపీ ప్రజాప్రతినిధి ఆధ్వర్యంలో ఎప్పటి కప్పుడు అమ్మకాలు జరిగిన ప్రాంతం వరకు ప్లాట్లు వేసి గుట్టు చప్పుడు కాకుండా కొనుగోలుదారులకు స్వాధీన పరుస్తున్నారు. ఇలా గత నెల రోజులుగా వ్యవహారం సాగుతోంది.



ఆటోనగర్ సమీపంలో ప్రభుత్వ భూమి ఆక్రమించి ఏర్పాటు చేస్తున్న ప్రహరీ

ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ..

ఇక ఆటోనగర్ సమీపంలో రెండు ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ ప్రభుత్వ భూమి యు ఆకారంలో ఎక్కువ పొడవులో ఉండటంతో పక్క సర్వే నెంబర్‌లో ఉన్న భూ యజమానులు ఎవరికి అవకాశం ఉన్నచోట వాళ్ళు స్వాధీనం చేసుకుంటున్నారు. అద్దంకి కొండ వద్ద స్టేడియం సమీపంలో శింగరకొండపాలేనికి చెందిన వైసీపీ నేతల ఆధ్వర్యంలో నిరుపేదలకు ఇళ్ళ స్థలాల పేరుతో రెచ్చగొట్టి ఆక్రమణలకు తెరలేపారు. గోపాలపురం సమీపంలో ఎర్రకుంట వద్ద కూడా రెండు నెలల క్రితం ఆక్రమణలకు సిద్ధమై చదును చేశారు. ఇలా ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ ఆక్రమణల పరంపరను అధికారపార్టీ నాయకుల కనుసన్నలలో సాగిస్తున్నారు. ఆక్రమణల విషయం ప్రారంభ దశలోనే రెవెన్యూ అధికారులు దృష్టికి వచ్చినప్పటికి మొక్కుబడిగా క్షేత్రస్థాయి సిబ్బంది దితో చెప్పిస్తుండటంతో ఆక్రమణలకు అడ్డుకట్ట పడక పోగా మరింత రెచ్చిపోయి వ్యవహరిస్తున్నరన్న విమర్శలు వస్తున్నాయి.

ఆ మాటలు నీటి మూటలేనా...

అద్దంకి వైసీపీ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టిన పాణెం హనిమిరెడ్డి అద్దంకి పట్టణంలోని ఆక్రమణల విషయం పత్రికల ద్వారా తెలుసుకొని అధికారులతో కలిసి పర్యటించి ఒకింత హడావుడి చేశారు. ప్రభుత్వ భూమి ఒక్క సెంటు కూడా ఆక్రమణకు గురికాకుండా చర్యలు చేపట్టాలని రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు చెప్పారు. అవసరమైతే ప్రభుత్వ భూముల చుట్టూ రక్షణ చర్యలు కూడా చేపడతామని అన్నారు. ఆ మాటలు నీటి మూటలే అని ప్రస్తుతం జరుగుతున్న ఆక్రమణల బట్టి తేటతెల్లం అవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



అద్దంకి ఊరచెరువులో ప్రభుత్వ భూమిగా ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

ఆక్రమణదారుల తెరవెనుక ఉన్నది వైసీపీ నేతలే కావటంతో ప్రభుత్వ భూముల ఆక్ర మణల విషయంలో మిన్నకుం టున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

రెవెన్యూ అధికారులలో కదలిక

ఊర చెరువులో ఆక్రమణలు గత రెండు రోజుల నుంచి మరలా ప్రారంభం కావటంతో స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎట్టకేలకు సోమవారం ఊరచెరువులో ప్లాట్లకు వేసిన హద్దు రాళ్ళను తొలగించి, ప్రభుత్వ భూమిగా ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. మిగిలినచోట్ల ఆక్రమణల విషయం రెవెన్యూ అధికారుల దృష్టికి పోయినా ఇంకా కదలిక లేకపోవటం విమర్శలకు తావిస్తుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఎన్నికల వేళ అద్దంకిలో జరిగే ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

- అద్దంకి కొండ వద్ద ఆక్రమించి వేసిన ప్లాట్లు



దిక్సూచి DIKSUCHI

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

బయాలజీ

స్త్రీ ప్రత్యుత్పత్తి వ్యవస్థ

స్త్రీ ప్రత్యుత్పత్తి వ్యవస్థలో ఒక జత స్త్రీ బీజకోశాలు, ఒక జత స్త్రీ బీజవాహికలు, గర్భాశయం, యోని, అనుబంధ గ్రంథులు ఉంటాయి. ఈ భాగాలు స్త్రీలలో శ్రోణి ప్రాంతంలో ఉంటాయి.


స్త్రీ బీజకోశాలు: ఇవి ఉదర కుహరంలో ఒక జతను కలిగి ఉండి, అండాలను, స్త్రీ బీజకోశ హార్మోనులను ఉత్పత్తి చేస్తాయి. వీటిలో అనేక స్త్రీ బీజ కోశపుటికలు ఉంటాయి. ఈ పుటికలలో అండాలు అభివృద్ధి చెందుతాయి. ఈ పుటికలు ప్రారంభంలో చిన్న చిన్న బుడగల రూపంలో ఉంటాయి. ప్రతి పుటికలోను ఒక అండం ఉంటుంది. అండం పరిపక్వం చెందినపుడు, పుటిక పగిలి అండం విడుదలవుతుంది. ఇలా అండం విడుదల కావడాన్ని అండోత్సర్గం అంటారు. అండాలు స్త్రీ బీజ వాహికలలోకి ప్రవేశిస్తాయి.

స్త్రీ బీజవాహిక: దీనిని ఫాలోపియన్ నాళం అని కూడా పిలుస్తారు. ఇవి ఒక జత ఉంటాయి. స్త్రీ బీజకోశం నుంచి ఇవి బయలుదేరుతాయి. దీనిలో కాలాంచిక, కలశిక, ఇస్తమస్ అనే నిర్మాణాలు ఉంటాయి. కాలాంచిక అనేది గరాటు ఆకారంలో ఉండి స్త్రీ బీజకోశం నుంచి విడులైన అండాలను సేకరిస్తుంది. కాలాంచిక నిర్మాణం తరవాత భాగమైన కలశికలోకి, కలశిక చివరి భాగమైన సన్నటి గ్రీవము(ఇస్తమస్) ద్వారా గర్భాశయంలోకి తెరచుకుంటుంది. ఫాలోపియన్ నాళంలోని కలశికలో శుక్రకణాలు, అండంలో ఫలదీకరణ చెందుతాయి.

గర్భాశయం: రెండు వైపులా ఉండే స్త్రీ బీజవాహికలు ఈ గర్భాశయంలోకి తెరచుకుంటాయి. గర్భాశయం... శ్రోణి ప్రాంతంలో మూత్రాశయానికి, పురీషనాళానికి మధ్య విశాలంగా, ధృడంగా, కండరయుతమై అధిక ప్రసరణ గల తలకిందులైన పియర్ ఆకారం పరిమాణంలో ఉండే కోశం లాంటి నిర్మాణం. పెరిమెట్రియం, మయోమెట్రియం, ఎండోమెట్రియం అనే మూడు కణజాలపు పొరలతో గర్భాశయకుడ్యం నిర్మితమైంది. గర్భాశయ ఎండోమెట్రియం రుతుచక్రంలో చక్రీయ మార్పులకు లోనైతే, ప్రసవ సమయంలో గర్భాశయ మెయోమెట్రియం ధృడమైన సంకోచాలను ప్రదర్శిస్తుంది. దీనిలో పిండ ప్రతిస్థాపనకు అనుకూల వాతావరణపు నియంత్రిత వ్యవస్థ ఉంటుంది. ప్రొజెస్టిరాన్ హార్మోన్ సహాయంతో ఫలదీకరణ చెందిన అండము గర్భాశయ కుడ్యంలో వున్న మృదు కణజాలానికి అతుక్కుంటుంది.

యోని: యోని విశాలంగా ఉండే తంతు-కండర యుత నాళం. దీనిని స్త్రీ బాహ్యజననాంగముగా పేర్కొంటారు. యోనిలో ఊర్ధ్వ, నిమ్న అనే రెండు రంధ్రాలుంటాయి. ఊర్ధ్వ రంధ్రాన్ని బాహ్యప్రసేక రంధ్రం అని, నిమ్న రంధ్రాన్ని యోని రంధ్రం అని పేర్కొంటారు. ప్రసేకం రంధ్రంపైన క్లిటోరిస్ అనే సున్నితమైన సంభించగల నిర్మాణం ఉంటుంది. ఇది పురుష మేహనానికి సమజాతము. యోనిపై భాగంలోని ఉబ్బెత్తు ప్రాంతాన్ని మాన్స్‌ప్యూబిస్ అంటారు. దీని చర్మంపై జఘన రోమాలు, చర్మం కింద కొవ్వు కణజాలపు దిండు ఉంటుంది.

అనుబంధ గ్రంథులు: స్త్రీలలో ప్రత్యుత్పత్తి అనుబంధ గ్రంథులు వరుసగా... బార్తోలిన్ గ్రంథులు, స్కీన్ గ్రంథులు, క్షీర గ్రంథులు. యోని రంధ్రానికి కొద్దిగా కిందగా ఇరువైపులా అమరి ఒక జత బార్తోలిన్ గ్రంథులు ఉంటాయి. వీటి స్రావం యోని మార్గాన్ని సులభంగా జారేటట్లు చేస్తుంది. ఈ గ్రంథులు పురుష ప్రత్యుత్పత్తి వ్యవస్థలోని బల్బోయురెత్రల్ గ్రంథులకు సమజాతం. స్కీన్ గ్రంథులు అనేవి ప్రసేకం కింద ఉంటాయి. ఈ గ్రంథులు పురుష ప్రత్యుత్పత్తి వ్యవస్థలోని పౌరుష గ్రంథులకు సమజాతం. ఇవి ప్రేరేపితమైనప్పుడు క్షార జిగట ద్రవాన్ని స్రవిస్తాయి. ఒక జత క్షీర గ్రంథులు శిశు జననాంతరం మాత్రమే పనిచేయడం ప్రారంభిస్తాయి. పురుషులలో ఇవి క్రియారహిత అవశేషాంగాలుగా ఉంటాయి.



బీజ కణోత్పత్తి: బీజకణోత్పత్తి అంటే ప్రాథమిక లైంగిక అవయవాలైన ముష్కం, స్త్రీ బీజకోశాల నుంచి బీజకణాలు(సంయోగ బీజాలు) ఏర్పడటం. పురుషులలో జరిగే బీజకణోత్పత్తిని శుక్ర కణోత్పత్తి అని, స్త్రీలలో జరిగే బీజకణోత్పత్తిని అండోత్పత్తి అని అంటారు.

శుక్రకణ నిర్మాణం: శుక్రకణ సూక్ష్మ నిర్మాణంలో... తల, మెడ, మధ్యభాగం, తోక అనే భాగాలు ఉంటాయి. తలభాగంలో ఏక్రోజోమ్ అనే టోపి లాంటి నిర్మాణం ఉంటుంది. ప్రోటియేజ్‌లు, ఏసిడ్ ఫాస్ఫటేజ్, హైలురోనిడేజ్ అనే ఎంజైములు ఏక్రోజోమ్‌లో ఉంటాయి. ఏక్రోజోమ్ అనేది ఫలదీకరణ సమయంలో శుక్రకణం, అండంలోకి చొచ్చుకొని పోయేందుకు సహాయపడుతుంది. తల భాగంలో ఏకస్థితిక కేంద్రం ఉంటుంది. మెడ అనేది తలభాగానికి, మధ్య భాగానికి ఉండే భాగం. మెడ కింది భాగాన్ని మధ్యభాగంగా పేర్కొంటారు. ఈ మధ్య భాగంలో మైటోకాండ్రియాలు చాలా ఉంటాయి. ఇవి శుక్ర కణాల తోక కదలిక, చలనానికి కావలసినంత శక్తిని అందిస్తాయి. మధ్యభాగం కింద ఉన్న నిర్మాణాన్ని తోకగా పేర్కొంటారు. ఈ తోక శుక్ర కణం చలించడానికి తోడ్పడుతుంది.

అండం: స్త్రీ బీజకోశం నుంచి విడుదలైన అండం పూర్తిగా పరిణితి చెందినది కాదు. ఇది జోనా పెల్యూసిడా చేత ఆవరించి ఉంటుంది. అండం విడుదల కావడాన్ని అండోత్సరం అంటారు. అండోత్సరం తరవాత గ్రాఫియన్ పుటికలలోని గ్రాన్యులోసా కణాలు విభజన చెంది కార్పస్ లూటియం అనే పసుపు రంగులో ఉండే తాత్కాలిక అంతః స్రావగ్రంథి కణజాలంగా ఏర్పడుతుంది. కార్పస్ లూటియం ప్రొజెస్టిరాన్ అనే హార్మోనును స్రవిస్తుంది.

రుతుచక్రం: స్త్రీ జీవులలో జరిగే ప్రత్యుత్పత్తి వలయాన్ని రుతుచక్రం అంటారు. రుతుచక్రం అంటే ప్రతి నెల గర్భాశయ అంతర ఉపకళ(ఎండోమెట్రియం)లో జరిగే మార్పుల చక్రం. స్త్రీలలో ప్రతి 28 రోజుల కొకసారి రుతుచక్రం జరుగుతుంది. రుతుచక్రం మధ్యలో ఒక అండం విడుదలవుతుంది. రుతుచక్రాన్ని రుతుస్రావ దశ, పుటిక దశ, అండోత్సర దశ, టాలియల్ దశ అనే నాలుగు దశలుగా విభజించవచ్చు. మొదటి రుతుచక్రం యవ్వన దశలో(10 నుంచి 14 సంవత్సరాలు) ప్రారంభమవుతుంది. దీన్ని రజస్వల లేదా మెనార్కి అంటారు. స్త్రీలలో 45 నుంచి 50 సంవత్సరాల వయసు మధ్యలో రుతుచక్రం ఆగిపోవడాన్ని రుతువిరతి లేదా ముట్లుడగడం(మెనోపాజ్) అంటారు.

సంపర్కం - ఫలదీకరణం: సంపర్క సమయంలో మేహనం యోనిలోకి శుక్రద్రవాన్ని స్కలిస్తుంది. చలన సహిత శుక్రకణాలు వేగంగా, ఈదుతూ గర్భాశయ ద్వారం గుండా గర్భాశయంలోకి ప్రవేశించి చివరకు ఫాలోపియన్ నాళం ఇస్తమస్ ద్వారా కలశికలోకి చేరుతాయి. ఇక్కడ స్త్రీ బీజకోశం నుంచి విడుదలై కాలాంచిక ద్వారా వచ్చిన అండంతో కలుస్తుంది. మానవునిలో అంతర ఫలదీకరణ జరుగుతుంది. ఫలదీకరణ తర్వాత సంయుక్త బీజం అనే నిర్మాణం ఏర్పడుతుంది.

పిండ త్వచాలు: పిండ ప్రతిస్థాపన అనంతరం పిండంలోని కొన్ని కణాలు పిండానికి పోషణ, రక్షణ, ఆధారమునివ్వటానికి వేర్వేరు త్వచాలుగా అభివృద్ధి చెందుతాయి. వీటినే పిండ త్వచాలు అంటారు. అవి.. పరాయువు, ఉల్బము, అళిందము, సోనసంచి.



కె.నాగేశ్వలు,
సీనియర్ ఫ్యాకల్టీ

ఆంధ్రప్రదేశ్ గురుకులాల్లో ప్రవేశానికి ఏపీఆర్‌జేసీ సెట్



గుంటూరులోని ఏపీ గురుకుల విద్యాలయాల సంస్థ(ఏపీఆర్ఈఐఎస్) - ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఉద్దేశించిన కామన్ అడ్మిషన్ టెస్ట్(ఏపీఆర్‌జేసీ సెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 7 జనరల్ కేటగిరీ, 3 మైనారిటీ కేటగిరీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీల్లో అడ్మిషన్స్ ఇస్తారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, ఈఈటీ, సీజీటీ గ్రూప్‌లు అందుబాటులో ఉన్నాయి.

ఆంధ్ర రీజియన్ గురుకులాలు(జనరల్)

- విజయనగరం జిల్లా-తాటిపూడి గురుకులంలో బాలికలకు ఎంపీసీ 60, బైపీసీ 40, ఎంఈసీ 30 సీట్లు ఉన్నాయి.
- కృష్ణా జిల్లా-నిమ్మకూరు గురుకులంలో బాలురకు ఎంపీసీ 25, బైపీసీ 15, ఎంఈసీ 12, సీఈసీ 15, ఈఈటీ 10, సీజీటీ 11 సీట్లు; బాలికలకు ఎంపీసీ 25, బైపీసీ 15, ఎంఈసీ 13, సీఈసీ 15, ఈఈటీ 11, సీజీటీ 10 సీట్లు ఉన్నాయి.
- పల్నాడు జిల్లా-నాగార్జునసాగర్ గురుకులంలో బాలురకు ఎంపీసీ 68, బైపీసీ 51, ఎంఈసీ 42, సీఈసీ 39 సీట్లు ఉన్నాయి.
- తిరుపతి జిల్లా-వెంకటగిరి గురుకులంలో బాలురకు ఎంపీసీ 60, బైపీసీ 40, ఎంఈసీ 30 సీట్లు ఉన్నాయి.

రాయలసీమ రీజియన్ గురుకులాలు(జనరల్)

- కర్నూలు జిల్లా బనవాసి గురుకులంలో బాలికలకు ఎంపీసీ 60, బైపీసీ 40, ఎంఈసీ 30 సీట్లు ఉన్నాయి.
- అన్నమయ్య జిల్లా-గ్యారంపల్లి గురుకులంలో బాలురకు ఎంపీసీ 60, బైపీసీ 40, ఎంఈసీ 30 సీట్లు ఉన్నాయి.
- శ్రీ సత్యసాయి జిల్లా-కొడిగెనహళ్లి గురుకులంలో బాలురకు ఎంపీసీ 50, బైపీసీ 30, ఎంఈసీ 25, సీఈసీ 30 సీట్లు ఉన్నాయి.
- కృష్ణా జిల్లా-నిమ్మకూరు గురుకులంలో బాలురకు ఈఈటీ 5, సీజీటీ 5 సీట్లు; బాలికలకు ఈఈటీ 4, సీజీటీ 4 సీట్లు ఉన్నాయి.
- పల్నాడు జిల్లా-నాగార్జునసాగర్ గురుకులంలో బాలురకు ఎంపీసీ 12, బైపీసీ 9, ఎంఈసీ 3, సీఈసీ 6 సీట్లు ఉన్నాయి.

మైనారిటీ గురుకులాలు

- గుంటూరు, కర్నూలు జిల్లాల్లో బాలుర గురుకులాలు ఉన్నాయి. అన్నమయ్య జిల్లా-వాయల్పాడులో బాలికల గురుకులం ఉంది. ఒక్కో గురుకులంలో ఎంపీసీ, బైపీసీ గ్రూప్‌లకుగాను ఒక్కోదానిలో మైనారిటీలకు 32, ఎస్సీలకు 6, ఎస్టీలకు 2 సీట్లు; సీఈసీలో మైనారిటీలకు 28, ఎస్సీలకు 5, ఎస్టీలకు 2 సీట్లు ఉన్నాయి.

అర్హత: ప్రస్తుతం పదోతరగతి పరీక్షలు రాసే రాష్ట్ర విద్యార్థులందరూ అర్హులే. మొదటిసారే ఉత్తీర్ణులు కావాలి. పదోతరగతి స్థాయిలో ఉర్దూ ఒక సబ్జెక్ట్‌గా చదివినవారు మాత్రమే ఉర్దూ మీడియంలో చేరేందుకు అర్హులు.

ఏపీఆర్‌జేసీ సెట్: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. మొత్తం 150 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఎంపీసీ/ఈఈటీ అభ్యర్థులకు జనరల్ ఇంగ్లీష్, మేథమెటిక్స్, ఫిజికల్ సైన్స్; బైపీసీ/సీజీటీ అభ్యర్థులకు జనరల్ ఇంగ్లీష్, బయో సైన్స్, ఫిజికల్ సైన్స్; ఎంఈసీ/సీఈసీ అభ్యర్థులకు జనరల్ ఇంగ్లీష్, సోషల్ స్టడీస్, మేథమెటిక్స్ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 50 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ పదోతరగతి స్థాయిలోనే ఉంటాయి.

ఏపీఆర్‌జేసీ సెట్ రాసే విద్యార్థులకు:

- **దరఖాస్తు ఫీజు:** రూ.300
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 31

మైనారిటీ విద్యార్థులకు:


- **దరఖాస్తుకు చివరి తేదీ:** మే 20
- **వెబ్‌సైట్:** https://aprs.apcfss.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/SDe5ZXnలో చదవండి.

రాజమౌళి, మహేశ్ చిత్రం ఎప్పటినుంచి అంటే...!



దర్శక ధీరుడు రాజమౌళితో చేయబోయే యాక్షన్ అడ్వంచర్ చిత్రం కోసం సన్నద్ధమవుతున్నారు మహేశ్ బాబు. ఇందు కోసం తన లుక్‌ను కూడా సరికొత్తగా మార్చుకున్నారు. తాజాగా ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ చిత్రం గురించి ఆయన అప్‌డేట్ ఇచ్చారు. అందరిలానే తానూ రాజమౌళితో చేసే చిత్రం షూటింగ్ ప్రారంభం కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నానని తెలిపారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా సాగుతున్నాయని, త్వరలోనే షూటింగ్ ప్రారంభం అవుతుందని వెల్లడించారు. ప్రొఫెషన్‌ను, వ్యక్తిగత జీవితాన్ని బ్యాలెన్స్ చేసుకోవడం కత్తి మీద సాము లాంటిదని మహేశ్ అన్నారు. తన రీసెంట్ రిలీజ్ 'గుంటూరు కారం' చిత్రంపై ప్రేక్షకులు చూపిన ఆదరణ ఆనందాన్ని ఇచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా తన జీవితాన్ని మార్చేసిన మూడు సినిమాల గురించి మహేశ్ ప్రస్తావించారు. 'మురారి', 'పోకిరి', 'శ్రీమంతుడు' చిత్రాలు ప్రేక్షకుల ముందు తనను సరికొత్తగా ఆవిష్కరించాయని తెలిపారు. తాను నటించే చిత్రాలకు అంగీకారం తెలిపేముందు పాత్ర, నైతిక విలువలను దృష్టిలోకి తీసుకుంటానని అన్నారు. ఒకసారి చిత్రానికి సైన్ చేశాక దర్శకుడి విజన్ ప్రకారమే ముందుకెళ్తానని తెలిపారు.



మిడిల్ క్లాస్ రాముడు

విజయ్ దేవరకొండ నటిస్తున్న 'ఫ్యామిలీ స్టార్' చిత్రం టీజర్ విడుదలైంది. మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. పరశురామ్ పెట్ల దర్శకుడు. వాసు వర్మ క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఏప్రిల్ 5న ఈ సినిమా విడుదల కానుంది.

గోపీసుందర్ కంపోజ్ చేసిన 'దేఖోరే దేఖో' పాటతో హీరో క్యారెక్టరైజేషన్‌ను వర్ణిస్తూ సాగిన ఈ టీజర్ ఆకట్టుకుంటోంది. సర్‌నేమ్‌కు సరెండర్ అయి, ఫ్యామిలీ అంటే వీక్‌నెస్ ఉన్న మిడిల్ క్లాస్ రాముడిగా హీరో విజయ్‌ను టీజర్ లో చూపించారు. ఈ టీజర్ చివరిలో హీరోయిన్ మృణాల్ 'నేను కాలేజికి వెళ్లాలి.. కొంచెం దించేస్తారా' అని అడిగితే, 'లీటర్ పెట్రోలు కొట్టిస్తే దించేస్తా' అంటాడు హీరో. ఇలా ఫ్యామిలీ, క్లాస్, మాస్, లవ్, యాక్షన్ ఎలిమెంట్స్‌తో కట్ చేసిన టీజర్ కంప్లీట్ మూవీని షార్ట్‌గా చూసిన అనుభూతి కలిగించింది. ఈ సమ్మర్‌కు కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లా 'ఫ్యామిలీ స్టార్' ఉండబోతోందనే క్లారిటీని ఈ టీజర్ ఇచ్చింది.

గామి... సాహస ప్రయాణం

చాందినీ చౌదరి



విశ్వక్‌సేన్ నటించిన 'గామి' చిత్రం ఈ నెల 8న విడుదల కానుంది. ఈ చిత్ర కథానాయిక చాందినీ చౌదరి సోమవారం విలేకరుల సమావేశంలో చిత్ర విశేషాలను పంచుకున్నారు.

- 'వారణాసి, కుంభమేళ, కశ్మీర్, హిమాలయాలు.. ఇలా విభిన్న లొకేషన్స్‌లో షూటింగ్ చేశాం. ఈ టీమ్‌లో నేను ఒక్కదాన్నే అమ్మాయిని. చాలా సవాల్‌తో కూడిన పరిస్థితుల్ని ఎదుర్కొన్నాం. ముఖ్యంగా వాష్ రూమ్ ఫెసిలిటీస్ లేకపోవడంతో నీళ్లు కూడా తాగేదాన్ని కాదు. దాదాపు నెల రోజుల పాటు అలా షూటింగ్ చేశాం. స్టంట్స్ నేనే రియల్‌గా చేశా. ఒక రకంగా చెప్పాలంటే గామి నిర్మాణం..సాహస ప్రయాణం.
- కథ వినగానే చిత్ర నిర్మాణానికి ఎక్కువ సమయం పడుతుందని అర్థమైంది. ఎందుకంటే చాలా పెద్ద కాన్వాస్ ఉన్న కథ ఇది. దర్శకుడు విద్యాధర్ తను అనుకున్నది వచ్చే వరకూ వదిలిపెట్టరు. షూటింగ్‌కు ఎక్కువ సమయం తీసుకున్నాం కనుకే విజువల్స్ అద్భుతంగా వచ్చాయి.

'భీమ'లో సర్‌ప్రైజింగ్ ఎలిమెంట్స్

నిర్మాత కె.కె. రాధామోహన్



'గోపీచంద్ ఇంతకుముందు చాలా పోలీస్ పాత్రలు చేశారు. కానీ 'భీమ'లో పాత్ర విభిన్నంగా ఉంటుంది. కొత్త జానర్‌లో ఉండే కథ ఇది. ఇలాంటిది గోపీచంద్ కూడా చేయలేదు. ఇందులో సర్‌ప్రైజింగ్ ఎలిమెంట్స్ చాలా ఉన్నాయి. సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిస్తుంది. పోలీస్ గెటప్ కాకుండా ఇందులో గోపీచంద్ మరో గెటప్ కూడా ఉంది. అదేమిటనేది మార్చి 8న తెలుస్తుంది' అని చెప్పారు నిర్మాత కె.కె. రాధామోహన్. కన్నడ దర్శకుడు ఎ.హర్ష దర్శకత్వంలో గోపీచంద్ హీరోగా ఆయన నిర్మించిన 'భీమ' చిత్రం ఈ నెల 8న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆయన సోమవారం మీడియాతో ముచ్చటిస్తూ 'బాలకృష్ణ గారి 'అఖండ' చిత్రానికి మా సినిమాకీ ఏ మాత్రం పోలిక లేదు. బెంగళూరు, బాదమి పరిసర ప్రాంతాల్లో ఉండే పరశురామ క్షేత్రంలో జరిగే కథ ఇది. శివాలయం, అఘోరాలను యాంబియన్స్ కోసం చూపించాం. అఘోరాలకు ఈ కథతో సంబంధం లేదు' అని ఆయన స్పష్టం చేశారు. దర్శకుడు హర్షను తెలుగు తెరకు పరిచయం చేయడం గురించి వివరిస్తూ 'ముందు మనం కథని నమ్మాలి. ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్లు కథ ఉందా లేదా అని చూడాలి. దానికి తగ్గ నటీనటులు, సాంకేతిక నిపుణులను ఎన్నుకోవాలి. హర్ష చాలా క్లారిటీ ఉన్న దర్శకుడు. తను కొరియోగ్రాఫర్ కూడా. మా 'బెంగాల్ టైగర్' చిత్రానికి వర్క్ చేశారు. 'భీమ'ని అద్భుతంగా తీశారు. రెండు పాటలకు కొరియోగ్రఫీ కూడా చేశారు' అన్నారు.

ప్రతి భారతీయుడు గర్వించే సినిమా

నిహార్ కపూర్



సీనియర్ నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు రూపొందించిన పాన్ ఇండియా మూవీ 'రికార్డ్ బ్రేక్' ఈ నెల 8న ప్రేక్షకుల ముందుకు రానుంది. నటి జయసుధ తనయుడు నిహార్ కపూర్ ఇందులో ఒక హీరోగా నటించారు. విడుదల సందర్భంగా ఆయన సోమవారం మీడియాకు చిత్ర విశేషాలు వెల్లడించారు.

- ఇంతకుముందు నేను 'గ్యాంగ్‌స్టర్ గంగరాజు' చిత్రంలో నటించాను. ఆ సినిమా షూటింగ్‌లో శ్రీనివాసరావుగారు 'బాగా చేస్తున్నావు.. నా దగ్గర ఓ కథ ఉంది. నువ్వు యాప్ట్ అవుతావు' అని కథ చెప్పారు. చాలా ఎక్సయిటింగ్‌గా అనిపించి నేను ఈ సినిమా ఒప్పుకొన్నాను. ఇద్దరు అనాధలు అడవిలో పెరుగుతుంటారు. కవలలైన వాళ్లిద్దరూ పట్నం వచ్చి కుస్తీ పోటీల్లో పాల్గొని ప్రపంచ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవడం ఈ చిత్రకథ. చాలా ఆసక్తికరంగా చూపించారు.
- 'దంగల్' చిత్రానికీ ఈ కథకు పోలిక లేదు. ఇందులో కుస్తీ పోటీల గురించి చెబుతూ ఇద్దరు అనాథల జర్నీని ఆకట్టుకొనే విధంగా చూపించారు. సెంటిమెంట్, ఎమోషనల్ అంశాలు కలిగిన కమర్షియల్ చిత్రమిది. సాంగ్స్, ఫైట్స్ బాగుంటాయి.
- రాజస్థాన్, హర్యానా వంటి ప్రాంతాల్లో కుస్తీ పోటీలు ఎక్కువగా జరుగుతాయి. డీటైలింగ్ మీద ఉత్తరాది వారు ఎక్కువ సినిమాలు తీస్తుంటారు. 'రికార్డ్ బ్రేక్' తెలుగు సినిమా అయినా ప్రతి భారతీయుడు గర్వించే విధంగా ఉంటుంది. ఇలాంటి చిత్రం తెలుగుతోనే ఆగిపోకూడదు. అందుకే ఎనిమిది భాషల్లో విడుదల చేస్తున్నాం.
- శ్రీనివాసరావుగారికి సినిమా అంటే ప్యాషన్. దేశభక్తి మిళితమైన మంచి కాన్సెప్ట్‌ను ఆసక్తికరంగా జనాలకు చెప్పాలనుకున్నారు. ఎక్కడా రాజీ పడకుండా నిర్మించారు.
- ఇక నుంచి నటనని కంటిన్యూ చేస్తా. అలాగే దర్శకత్వం కూడా చేయాలనుకుంటున్నాను. స్క్రిప్టులు తయారు చేస్తున్నా.

వినూత్నంగా ఆయ్



మ్యాడ్ మూవీతో కుర్రకారును మెప్పించారు నార్నే నితిన్. తాజాగా ఈ నటుడు నయన్ సారికతో కలసి 'ఆయ్' చిత్రంలో నటిస్తున్నారు. అంజి కంచిపల్లి ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. సక్సెస్‌ఫుల్ ప్రొడ్యూసర్ బన్నీ వాసుతో సంయుక్తంగా విద్య కొప్పినీడి నిర్మిస్తున్నారు. 'ఆయ్' సినిమా చిత్రీకరణ పూర్తి చేసుకుంది. దీంతో చిత్ర యూనిట్ ప్రమోషనల్ యాక్టివిటీస్‌ను వేగవంతం చేసింది. అందులో భాగంగానే ఈ హిలేరియస్ ఎంటర్టైన్‌మెంట్ టైటిల్‌ను అనౌన్స్ చేశారు. నిర్మాత బన్నీవాస్, నార్నే నితిన్, నయన్ సారిక, డైరెక్టర్ అంజిపల్లి మధ్య జరిగే సరదా ఫోన్ సంభాషణతో టైటిల్‌ను వినూత్నంగా ప్రకటించారు. సరదా సంభాషణ, ఫన్నీ మీమ్స్ రిఫరెన్స్‌లతో సాగే ఈ వీడియో అందరినీ మెప్పిస్తోంది. ఈ వీడియోలో 'సమ్మర్‌లో కలుద్దాం' అంటూ హింట్ ఇచ్చారు. మార్చి 7న ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ రిలీజ్ చేస్తామని తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్- సమీర్ కల్యాణి, సంగీత దర్శకుడు- రామ్ మిర్యాల, ఎడిటర్- కోదాటి పవన్ కల్యాణ్, ఆర్ట్ డైరెక్టర్- కిరణ్ కుమార్ మన్నె, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్- అజయ్ గద్దె, సహ నిర్మాతలు- భాను ప్రతాప్, రియాజ్ చౌదరి.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/afTXIlU లో చదవండి.


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ మురళీకృష్ణ

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

● భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా స్వామి దర్శనం జరగాలి

అమృతలూరు, మార్చి 4: అధికారులు సమన్వయంతో పనిచేయాలని రేపల్లె ఆర్డీవో హేలా షారోన్ తెలిపారు. ప్రసిద్ధి చెందిన శైవక్షేత్రం గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయ మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై ఆలయ ప్రాంగణంలో ద్వితీయ కో ఆర్డినేషన్ సమావేశం సోమవారం నిర్వహించారు. సమావేశంలో రేపల్లె ఆర్డీవో హేలా షారోన్ మాట్లాడారు. ఆయా శాఖల అధికారులతో ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష జరిపారు. ఆయా శాఖలు చేపట్టిన పనులను ఆర్డీవో అడిగి తెలుసుకున్నారు. రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. ఆలయ పరిసరాల్లో, రద్దీ ప్రదేశాల్లో సీసీ కెమెరాలు పర్యవేక్షణ ఉంటుందన్నారు. 200మంది సిబ్బంది విధుల్లో ఉంటారన్నారు. ట్రాఫిక్‌కు ఏలాంటి అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పండుగ ప్రత్యేక అధికారి అమర్‌నాథ్ మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినం రోజున స్వామివారిని సుమారు రెండు లక్షలమంది భక్తులు దర్శనం చేసుకుంటారన్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పంచాయతీరాజ్‌శాఖ అధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో పారిశుధ్యం, మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు, అదనపు సిబ్బందిని కేటాయిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి కోమల తెలిపారు. వైద్యాధికారి ఏసుబాబు మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో, వెలుపల రెండు వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. శిబిరాల్లో 24 గంటలు వైద్యులు, 104, 108 వాహనాలు అందుబాటులో ఉంటాయన్నారు. విద్యుత్ శాఖ ఏఈ నాంచారయ్య మాట్లాడుతూ అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేయడంతో పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. సమావేశంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ఆలపాటి రమాదేవి, ఈవో అశోక్‌రెడ్డి, సర్పంచ్ మండవ విజయలక్ష్మీ, డీఎల్‌పీవో తాతా శివశంకర రావు, తహసీల్దార్ కవిత, చుండూరు సీఐ శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధిపై కాంగ్రెస్ పార్టీ

స్పష్టమైన వైఖరితో ఉంది

● ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్

నరసరావుపేట టౌన్, మార్చి 4 :రాజధాని విషయంలో జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయకక్షలతో వ్యవహరించిన తీరు, రాజధాని లేకపోవటం వలన రాష్ట్రం నష్టపోయిన విధానంపై కాంగ్రెస్ పార్టీ ఒక స్పష్టమైన వైఖరితో ఉందని ఏపీ సీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ అన్నారు. సోమవారం నరసరావు పేటలోని పల్నాడు జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర పునర్‌వ్యవస్థీకరణ చట్టాన్ని 10 సంవత్సరాలుగా బీజేపీ అమలు చేయకపోవటం, అమలు చేయమని పోరాడలేని వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీలు ఉండటం వలన ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా పరిగణించిందన్నారు. ఇప్పుడు దుస్థితిలో ప్రత్యేక హోదా పది సంవత్సరాలు ఇస్తేనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందుతుందనే లక్ష్యాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రకటిస్తుందన్నారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి పేద కుటుంబానికి నెలకు రూ.5వేలు, ఏడాదికి రూ.60 వేలు, ఐదు సంవత్సరాలకు రూ.3 లక్షలు సాయం చేయాలనే గ్యారెంటీనీ కాంగ్రెస్ ప్రకటించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ, కాంగ్రెస్ పార్టీతో కలిసి వచ్చే రాజకీయ మిత్రులు ఇండియా కూటమీ రాష్ట్రానికి భవిష్యత్ చూపగలదని అన్నారు. సమావేశంలో ఏపీసీసీ వైస్‌ప్రెసిడెంట్ కొరివి వినయ్ కుమార్, కాంగ్రెస్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీ అలెగ్జాండర్ సుధాకర్, చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

పసుపు రైతులకు సత్వర న్యాయం చేకూర్చాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాదెండ్ల, టీడీపీ-జనసేన నాయకులు

● కోల్డ్ స్టోరేజ్ అగ్నిప్రమాదం కారణాలను వెల్లడించాలి
● 700 మంది రైతులకు రూ.100 కోట్ల మేర నష్టం
● కలెక్టర్‌కు నాదెండ్ల మనోహర్ వినతి పత్రం అందజేత
● నివేదికను సీఎం కార్యాలయానికి పంపుతాం : కలెక్టర్

గుంటూరు(తూర్పు), మార్చి4: దుగ్గిరాల కోల్డ్‌సోరేజ్‌లో అగ్ని ప్రమాదం జరిగి దాదాపు 45 రోజులు గడుస్తున్నా, అధికారులు మాత్రం ఇంతవరకు ప్రమాద కారణాలు వెల్లడించలేకపోవడం బాధాకరమని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, తెనాలి టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అన్నారు. కోల్డ్‌స్టోరేజ్ అగ్నిప్రమాదంలో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ ఆప్రాంత రైతులు, జనసేన, టీడీపీ నేతలతో కలిసి సోమవారం స్పందనలో గుంటూరుజిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. అనంతరం నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ దాదాపు 700మంది పసుపు రైతులకు రూ.100 కోట్లు మేర నష్టం వాటిల్లిందని, కానీ అధికారులు మాత్రం రూ.40 కోట్లుకు బీమా ఉందని చెబుతున్నారని, దీంతో రైతులలో ఆందోళన నెలకొందన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాకు రూ.13 వేల వరకు ఉందని, కానీ క్వింటాకు రూ.4వేలుచొప్పున లెక్కకట్టడానికి ఆధికారులు చూస్తున్నారని, దీంతో రైతులు తీవ్రంగా ఆందోళనలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలోనే రైతులను ఆదుకోవాలని టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ ఉన్నాతాధికారులకు లేఖ రాసారని దీనిపై స్పందన లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విచారణ వేగంగా పూర్తి చేసి బీమా సంస్థ నిధులు ఆలస్యమైతే ధరల స్థిరకరణ నిధి, విపత్తు నిధులనుంచి పరిహారం చెల్లించాలని కోరారు. అలాగే వినతిపత్రంపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారని, మంగళవారం సాయంత్రం లోపు నివేదికను తీసుకుని, వెంటనే ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపుతామని హామీ ఇచ్చినట్టు నాదెండ్ల తెలిపారు. రెండు రోజుల్లో ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి స్పందన రాకపోతే భవిష్యత్తు కార్యా చరణ రూపొందిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు గాదె వెంకటేశ్వర్లు, నేరళ్ల సురేష్, గంధం సురేష్, ఆళ్ల హరి, రైతు సంఘ నాయకులు కళ్లం రాజశేఖరరెడ్డి, ఆ ప్రాంత రైతులు తదితరులు పాల్గొన్నారు.

బీమా అధికారికి రైతు సంఘాల నాయకుల వినతి

గుంటూరు(తూర్పు) : దుగ్గిరాల కోల్డ్ స్టోరేజీలో సంభవించిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన పసుపు రైతులకు న్యాయం చేయాలని సోమవారం గుంటూరు కొరిటిపాడులోని న్యూఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ డిప్యూటీ మేనేజర్ పీ. నాగచంద్రికకు రైతు సంఘాల నేతలు వినతిపత్రం అందజేశారు. నాగచంద్రిక స్పందిస్తూ.. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘాల నేతలు కేవీవీ ప్రసాదు, కొల్లి రంగారెడ్డి, పచ్చల శివాజీ, యార్లగడ్డ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జయహో బీసీ సభను విజయవంతం చేయాలి...

గుంటూరు : బీసీ వర్గాల అభ్యున్నతి కోసం మంగళగిరిలో మంగళవారం నిర్వహించే జయహో బీసీ సభను విజయవంతం చేయాలని నాదెండ్ల మనోహర్ పార్టీ వర్గాలకు పిలుపునిచ్చారు. సోమవారం జనసేనపార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఈసభలో పాల్గొంటారన్నారు. బీసీ వర్గాల అభ్యున్నతి కోసం టీడీపీ, జనసేన కలసి పని చేస్తాయని ఆయన తెలిపారు. సమావేశంలో బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, గాదె వెంకటేశ్వర్లు, నేరెళ్ల సురేష్, చిల్లపల్లి శ్రీనివాస్, కొర్రపాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

620 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

మంగళగిరి, మార్చి 4: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం లారీని సోమవారం మంగళగిరి మండలం కాజా టోల్‌ప్లాజా వద్ద విజిలెన్స్, పౌరసరఫరాల శాఖ అధికారులు దాడిచేసి పట్టుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు టోల్‌ప్లాజా వద్ద నిఘా ఏర్పాటు చేసి రేషన్ బియ్యం తరలిస్తున్న ఏపీ16టీజే5236 నెంబరు గల లారీని అడ్డుకొని 620 బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు రూ.11.78లక్షలు వుంటుందని మంగళగిరి డిప్యూటీ తహసీల్దారు దుర్గారావు తెలిపారు. బియ్యం బస్తాలను నూజివీడు నుంచి నెల్లూరు జిల్లాకు తరలిస్తున్నట్టు గుర్తించామన్నారు. లారీని, డ్రైవరును అదుపులోకి తీసుకుని మంగళగిరి రూరల్‌పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ దాడుల్లో విజిలెన్స్ సీఐ ఆళ్ల శ్రీహరి, వీఆర్వో రామారావు, పౌరసరఫరాల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.


జిల్లా జట్టుకు ఎంపికైన లిఫ్టర్లతో అసోసియేషన్ ప్రతినిధులు

క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ జట్ల ఎంపిక

మంగళగిరిసిటీ, మార్చి 4: గుంటూరు జిల్లా సీనియర్స్ పురుషులు, మహిళల క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ ఎంపిక పోటీలు మంగళగిరి ఫిట్‌జోన్ జిమ్‌లో జరిగాయి. ఎంపికైన క్రీడాకారుల వివరాలను జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయభాస్కరరావు, షేక్ సందాని సోమవారం వెల్లడించారు. పురుషుల జట్టుకు హెచ్.రమేష్‌శర్మ(గుంటూరు), వై.హర్షవర్ధన్ (తెనాలి), ఎల్.దినేష్(గుంటూరు), ఎస్‌కే అష్రాఫ్ అలీ (గుంటూరు), రామ్‌కుమార్(మంగళగిరి), కౌశిక్(తెనాలి), రాజాదత్తు (గుంటూరు), పీ.దేవేందర్‌రెడ్డి (తెనాలి), ఎం.అభిషేక్ (గుంటూరు) ఎంపికయ్యారు. మహిళల జట్టుకు ఎం.షానున్ (తెనాలి), వి.రేవతి (తెనాలి), ఈఎల్ వినయశ్రీ(తెనాలి), ఎన్.నాగదివ్య (తెనాలి), బి.చంద్రిక (మంగళగిరి) ఎంపికయ్యారు. వీరు విశాఖపట్నంలో జరిగే ఏపీ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల పదవ తేదీన జరిగే సీనియర్స్ మెన్ అండ్ ఉమెన్ క్లాసిక్ ఎంపిక పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పురుషుల జట్టుకు సందాని కోచ్‌గా, గుమ్మడి వెంకటేశ్వరరావు మేనేజరుగా, మహిళల జట్టుకు విజయభాస్కరరావు కోచ్‌గా, ఘట్టమనేని సాయిరేవతి మేనేజరుగా వ్యవహరిస్తారని తెలియజేశారు. జిల్లా జట్టుకు ఎంపికైన లిఫ్టర్లను అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఆర్ఎస్. వంశీకృష్ణ, బి.ప్రసాద్, పీ.భాస్కరరావు, సంయుక్త కార్యదర్శులు మస్తాన్‌వలి, నాగశిరీష, సభ్యులు అభినందించారు.


సమావేశంలో మాట్లాడుతున్న నక్కా ఆనందబాబు

టీడీపీ-జనసేన విజయం చారిత్రిక అవసరం

● మాజీ మంత్రి నక్కా ఆనందబాబు

చుండూరు మార్చి 4: రాష్ట్రంలో నేడు నెలకొన్న సంక్షోభ పరిస్థితుల్లో టీడీపీజనసేన పార్టీలు అధికారంలోకి రావడం ఓ చారిత్రిక అవసరమని ఆనందబాబు అన్నారు. సోమవారం వేటపాలెంలో జరిగిన టీడీపీ, జనసేన పార్టీల మండల కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆనందబాబు మాట్లాడుతూ చంద్రబాబు సుదీర్ఘ పాలన అనుభవం, రాజకీయ చతురత నేడు రాష్ట్రానికి అవసరమన్నారు. తిరిగి రాష్ట్రంలో మనం అధికార పగ్గాలు చేపట్టి పూర్వ వైభవాన్ని తీసుకురావలన్నారు. జగన్ అసమర్థ పాలనతో సామాన్యుల బతుకులు బారంగా మారాయని, ఉద్యోగుల నెల జీతాల కోసం ఆందోళన చేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్ర సెక్రటరేయట్ తాకట్టు పెట్టుకోవాల్సిన దుస్థితి కల్పించారని, సంక్షేమ పథకాల పేరుతో అన్నివర్గాలను మోసం రాష్ట్రాన్ని దివాళాతీయించాడని మండిపడ్డారు. జగన్ రానున్న ఎన్నికల్లో వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధి పొందడానికి కుటిలయత్నాలు చేస్తున్నాడని, వీటిని కార్యకర్తలు క్షేత్రస్థాయిలోనే సమర్ధవంతంగా ఎదుర్కొవాలని ఆనందబాబు సూచించారు. కార్యక్రమంలో టీడీపీ బాపట్ల పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షులు తమ్మా శివారెడ్డి, జనసేన వేమూరు నియోజక వర్గ ఇన్‌చార్జి ఉసా రాజేష్, గూడేటి ఎల్లారెడ్డి, కావూరు శ్రీనివాస రావు, ఎన్ఆర్ఐ బాబు, రాయపాటి శ్రీను, శ్రీరామమూర్తి, కంఠంనేని రాహుల్, దేవిరెడ్డి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతు ఆత్మహత్య

గురజాలటౌన్, మార్చి 4: అప్పులబాధ తాళలేక కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని మాడుగులలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన బండ్ల నారాయణ (37) తనకున్న 6 ఎకరాలతోపాటు 20 ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి, మిరప సాగు చేశాడు. సరైన దిగుబడి రాకపోవడంతో రూ. 28 లక్షల వరకు అప్పులయ్యాయి. మనస్థాపం చెందిన నారాయణ మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు సీఐ బాలకృష్ణ తెలిపారు.


గుడారాల పండుగకు ఏర్పాటు చేసిన స్వాగత ద్వారాలు

7 నుంచి గుడారాల పండుగ

గుంటూరు(తూర్పు),మార్చి4: హోసన్నామినిస్ట్రీస్, గోరంట్ల ఆధ్వర్యంలో ఈనెల 7నుంచి 10వ తేది వరకు వరకు 47వ అంతర్జాతీయ గుడారాల పండుగ జరుపుతున్నట్టు హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షుడు బ్రదర్ అబ్రహాం, చీఫ్ పాస్టర్ జాన్‌వేస్లీలు తెలిపారు. గుడారాల పండుగకు సంబంధించిన ఏర్పాట్లును సోమవారం పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ గతంలో కంటే ఎక్కువ మంది ఈ పండుగలోపాల్గొనే అవకాశముందని, అందుకు తగినట్టుగా ఏర్పాట్లు చేస్తున్నట్టు వివరించారు. భోజనశాల, నిద్రించేందుకు వసతులు కల్పిస్తున్నామని బ్రదర్ అబ్రహాం, చీఫ్ పాస్టర్ జాన్‌వేస్లీలు తెలిపారు.

శివరాత్రి బ్రహ్మోత్సవాలకు సిద్ధం

● కాకాని మల్లన్న సన్నిధిలో రేపటి నుంచి అంకురార్పణం
● పెళ్ళికొడుకు పెళ్ళి కుమార్తెగా శివపార్వతులు

పెదకాకాని, మార్చి 4: పెదకాకాని మల్లన్న సన్నిధిలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తికావచ్చాయి. ఈనెల 6 నుంచి 12వ తేదీ వరకు ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను రమణీయంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లుచేస్తున్నారు. ఆలయ ప్రాంగణం, వెలుపల భాగాలు విద్యుత్‌కాంతులతో విరాజిల్లుతున్నాయి. పెదకాకాని జాతీయ రహదారినుంచి ఆలయం వరకు ప్రత్యేక భారీ విద్యుత్ కటౌట్‌లను ఏర్పాటుచేశారు. ప్రధాన కూడళ్లలో సూపర్ వత్తుల విద్యుత్తు కటౌట్లను తీర్చిదిద్దారు. అర్చకులు ఉత్సవ విగ్రహాలను శుభ్రపరుస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయంలో లోపల బయట ప్రత్యేక క్యూలను ఏర్పాటు చేశారు. ఉత్సవాల ఏర్పాట్లను ఆలయ ఈవో, డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ ప్రసాదరావు, చైర్మన్ అమ్మిశెట్టి శివ శంకరరావులు పర్యవేక్షిస్తున్నారు.


ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు


ఉత్సవ మూర్తుల విగ్రహాలను శుభ్రపరుస్తున్న అర్చకులు

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.63 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	130, 139,150
చికెన్ విత్ స్కిన్	248.00
చికెన్ స్కిన్ లెస్	258.00

1,12,364 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 1,18,979 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,12,364 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 95,450 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9000	19500
నెంబరు. 5	13000	19000
273	8000	16500
341	10500	20000
4884	13000	19000
సూపర్ 10	11500	15400
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	9000	20500
బ్యాడిగి	11000	19000
దేవనూరు డీలక్స్	10000	19500
తెల్లకాయలు	5000	11000


మందడం రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న రైతులు

మూడుముక్కలాటతో రాష్ట్రం చిన్నాభిన్నం

● 1539 వ రోజుకు చేరిన రైతుల ఆందోళనలు

తుళ్ళూరు , మార్చి 4: మూడు రాజధానుల మూడు ముక్కలాటతో సీఎం జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని చిన్నాభిన్నం చేశాడని, రాజధాని అమరావతికి 33 వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు రైతు కూలీలు మహిళలు చేస్తున్న ఆందోళనలు, నిరసన దీక్షలు సోమవారం నాటికి 1539వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి పలువురు రైతులు మాట్లాడుతూ.. అమరావతి ఐదు కోట్ల మంది ఆంధ్రుల సంపదన్నారు. దానిని నిర్వీర్యం చేసే దాక సీఎం జగన్‌రెడ్డి నిద్ర పోలేదన్నారు. ఏ వ్యవస్థని సక్రమం నడపలేకపోయాడన్నారు. గాడి తప్పిన పాలన సరిచేయాలంటే విజన్ ఉన్న నాయకుడు సీఎం కావాలన్నారు. లేకపోతే రాష్ట్ర అధోగతి పాలవుతుందన్నారు. మూడు రాజధానులు అనేది హైకోర్టు తీర్పుతో ముగిసిన అధ్యాయమని, సీఎం జగన్‌రెడ్డి ఇప్పటికైనా రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని ప్రకటించి అభివృద్ధిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు. తుళ్లూరు, నెక్కల్లు, అనంతవరం, వెంకటపాలెం, మందడం, ఉద్దండ్రాయునిపాలెం తదితర రాజధాని గ్రామాల్లో రైతుల ఆందోళనలు కొనసాగాయి.

హూండీల ఆదాయం రూ.20 లక్షలు

అమరావతి, మార్చి 4: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయంలో భక్తుల నుండి కానుకల ద్వారా రూ.20లక్షల ఆదాయం లభించినట్లు ఈవో వేమూరి గోపి తెలిపారు. 80 రోజులకు గాను ప్రధాన హూండీల ద్వారా రూ.18,37,744, అన్నదాన హూండీ ద్వారా రూ1,63,085 ఆదాయం లభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈవోతో పాటు పరిశీలకులు వెంకట శ్రీనివాస్, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ మేనేజరు కౌశల్‌శర్మ, సిబ్బంది, సేవా సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

కౌలు రైతు హత్యకేసులో వీడిన మిస్టరీ

● ఒకరు అనుమానంతో.. మరోకరు వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని తుదముట్టించిన వైనం

వినుకొండటౌన్, మార్చి4 : ఈపూరు మండలం అగ్నిగుండాల సమీపంలో కాలవకట్టపై గత నెల 21న కౌలు రైతు తులసీనాయక్‌ను హత్యచేసిన కేసులో ఎట్టకేలకు నలుగురు నిందితులను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. వినుకొండ రూరల్‌పోలీసు కార్యాలయంలో సీఐ సుధాకర్ విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి నిందితుల వివరాలను వెల్లడించారు. బొల్లాపల్లి మండలం మాలపాడు గ్రామానికి చెందిన భుక్యా తులసీనాయక్ (42) అగ్నిగుండాల సమీపంలో పొలం కౌలుకు తీసుకుని సాగుచేస్తు జీవణం సాగిస్తున్నాడని, అదేగ్రామానికి చెందిన రామావత్ శివానాయక్ తండ్రి శీతల నాయక్ గతంలో అనారోగ్యంతో మృతి చెందినప్పనటికీ, తులసీనాయక్ చేతబడిచేసిన కారణంగానే తన తండ్రి మృతి చెందాడని అనుమానం పెంచుకున్నాడు. అలాగే బొల్లాపల్లి గ్రామానికి చెందిన గంగిరెడ్డి నాగిరెడ్డి తులసీ నాయక్ భార్యతో వివాహేతర సంబంధం కలిగి అతని ఇంటికి వస్తూపోతూ ఉండేవాడు. ఈ విషయంలో తులసీనాయక్ నాగిరెడ్డిని గతంలో పలుమార్లు హెచ్చరించాడు. దీంతో శివానాయక్, నాగిరెడ్డిలు కలసి తులసి నాయక్‌ను అడ్డుతొలగించుకునేందుకు పథకం వేశారు. తూర్పుగోదావరి జిల్లా, కాకినాడ హర్బన్ దుమ్మాలపేటకుచెందిన యర్రబెల్లి గంగతో రూ.5 లక్షలకు కాంట్రాక్టు కుదుర్చుకున్నారు. శివానాయక్ స్నేహితుడైన రామాంజినాయక్‌తో కలిసి మొత్తం నలుగురు తులసినాయక్‌ను హత్య చేసేందుకు కాపలాకాశారు. ఫిబ్రవరి 21న ఒంటరిగా ద్విచక్రవాహనంపై పొలం వెళ్ళి వస్తున్న తులసీ నాయక్‌పై గంగ కర్రతో భలంగా దాడిచెయ్యడంతో అక్కడికక్కడే మృతిచెందినట్లు సీఐ తెలిపారు. కొండ్రముట్ల సమీపంలో నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. ఎస్ఐలు చెన్నకేశవులు, మహమ్మద్ ఫిరోజ్, నాగిరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

7న కాంగ్రెస్ బహిరంగసభ వాయిదా

గుంటూరు, మార్చి 4: ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలతో పాటు ఇతర కాంగ్రెస్ అగ్రనేతలతో ఈనెల 7న గుంటూరులో తలపెట్టిన బహిరంగసభ వాయిదావేసినట్లు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు లింగంశెట్టి ఈశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రానున్న మహాశివరాత్రి పురస్కరించుకొని బహిరంగ సభను వాయిదా వేశామని, త్వరలోనే సభపై మరో తేదీని ప్రకటిస్తామని లింగంశెట్టి తెలిపారు.

టీడీపీ మైనార్టీ రాష్ట్ర కమిటీలోకి జిల్లా నేతలు

గుంటూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): టీడీపీ ముస్లిం మైనార్టీ రాష్ట్ర కమిటీలో ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన ముగ్గురు నేతలు ఎంపికయ్యారు. గుంటూరు తూర్పు నుంచి షేక్ ఖలీల్, తాడికొండ నుంచి షేక్ మొహమ్మద్ నూర్, ప్రత్తిపాడు నుంచి షేక్ అబ్దుల్ రజాక్, సత్తెనపల్లి నుంచి సయ్యద్ మహబూబ్‌లు ఎంపికయ్యారు. అలాగే టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కమిటీలో గుంటూరు పశ్చిమకు చెందిన పిన్నమనేని రామచంద్రరావు, మాచర్లకు చెందిన వాటికొండ రంగనాయకులు, పీ.పుల్లయ్య, సత్తెనపల్లి నుంచి రావిపాటి మధుబాబు ఎంపికయినట్లు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ప్రకటించారు.

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



గీతాంజలి తెలుగు అనువాద పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయిత దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ తదితరులు

గ్రంథపఠనంతో విజ్ఞాన విలువల పెంపు

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, మార్చి 4: గ్రంథపఠనంతో విజ్ఞాన విలువలు పెంపొందుతాయని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ అన్నారు. బాపట్ల టీడీపీ కార్యాలయంలో ప్రముఖ రచయిత, సాహిత్యరత్న దమ్మాలపాటి వెంకటేశ్వరరావు రచించిన గీతాంజలి తెలుగు అనువాద పుస్తకాన్ని సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నరేంద్రవర్మ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ ఎదుటివారితో మాట్లాడటానికి, విలువలు పంచుకోవటానికి ప్రతి ఒక్కరు ఉన్నతమైన గ్రంథాలు పఠించాలన్నారు. రవీంద్రనాథ్‌ఠాగూర్ రచించిన గీతాంజలిని సరళీకృతం చేసి వెంకటేశ్వరరావు ప్రజలకు అందించటం గొప్పవిషయమన్నారు. కార్యక్రమంలో పుస్తక అనువాద రచయిత దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, సాహితీవేత్త మన్నె శ్రీనివాసరావు, టీడీపీ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి తానికొండ దయాబాబు, సంగం డెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి, రోటరీ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ రావూరి వీరరాఘవయ్య రామ్మోహనరావు, కామేపల్లి కృషిబాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన ముస్లిం యువత



టీడీపీలో చేరిన ముస్లిం యువతతో ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, మార్చి 4: పట్టణంలోని 30, 31 వార్డులకు చెందిన 35 ముస్లిం కుటుంబాల యువత సోమవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. అదేవిధంగా 34వ వార్డుకు చెందిన రెడ్డి సామాజికవర్గ నాయకులు టీడీపీలో చేరటంతో వారికి పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇప్పటివరకు తటస్థంగా ఉన్న తామంతా నరేంద్రవర్మ విజయం కోసం సైనికునివలే పనిచేస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు పరీద్ మస్తాన్, మందపాటి ఆంద్రేయ, సురేష్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

● వీవోఏల సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.లక్ష్మీ

బాపట్ల, మార్చి 4: హామీలను అమలుచేయాలని వీవోఏల సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.లక్ష్మీ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట జిల్లా వెలుగు యానిమేటర్స్ సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీ మాట్లాడుతూ జనవరి 30, 31 తేదీల్లో విజయవాడలో సెర్ప్ సీఈవో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, మూడు సంవత్సరాల కాలపరిమితి జీవోను రద్దు చేయాలన్నారు. రూ.10లక్షల ప్రమాదబీమా ఇవ్వాలని, వీవోఏలకు గుర్తింపుకార్డులు, యూనిఫామ్‌లు ఇవ్వాలని తదితర డిమాండ్లను అమలు చేయాలన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సి.హెచ్.మజుందార్ మాట్లాడుతూ సెర్ప్ సీఈవో హామీలు నెరవేర్చకుండా రాజీనామా చేసి వైసీపీలో చేరటంతో హామీలు గాలిమూటలయ్యాయన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని హామీలను నెరవేరుస్తూ జీవో జారీ చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు టి.పుణ్యలక్ష్మీ, వై.జ్యోతి, కృష్ణకుమారి, పద్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జేసీ సి.హెచ్.శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు.

లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ పంపిణీ



లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి, అధికారులు

బాపట్ల, మార్చి 4 : స్థానిక ఎం.ఎస్.ఆర్ కల్యాణ మండపంలో సోమవారం జగనన్నకాలనీల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ పంపిణీ నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కోన రఘుపతి ముఖ్యఅతిథిగా పాల్గొని పంపిణీ చేశారు. నవరత్నాలలో భాగంగా పేదలందరికీ ఇళ్ళస్థలాలిచ్చి వాటిని రిజిస్ట్రేషన్ చేశామన్నారు. రాబోయే రోజులలో మరింత మేలు చేయటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైసీపీనియోజకవర్గ పరిశీలకురాలు డాక్టర్ నల్లమోతు రూతురాణి, ఆర్డీవో గంధం రవీందర్, మున్సిపల్ కమిషనర్ బొజ్జ శ్రీకాంత్, తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్, మున్సిపల్ ఆర్వో సుబ్బారావు, వైసీపీ పట్టణ, మండలాధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, కోకి రాఘవరెడ్డి, ఎస్సీసెల్ నాయకులు ఇనగలూరి మాల్యాద్రి, జోగి రాజా, నాయకులు సోముల రాజశేఖర్‌రెడ్డి, షేక్ సయిద్ పీర్, ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం



మృతురాలి భర్త గంగయ్యకు ఆర్థికసాయం అందజేస్తున్న జీఎస్‌పాలెం గ్రామసర్పంచ్ దబ్బకూటి మాధవరావు, కార్యదర్శిసుధాకరరావు

పిట్టలవానిపాలెం, మార్చి 4: మండలంలోని జీఎస్‌పాలెం గ్రామ పంచాయతీకి చెందిన కుమ్మరిగుంట మార్తమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం గ్రామసర్పంచ్ దబ్బకూటి మాధవరావు వారి కుటుంబసభ్యులను పరామర్శించి మృతురాలి భర్త గంగయ్యకు రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి సి.హెచ్. సుధాకరరావు తదితరులు పాల్గొన్నారు.

● కర్లపాలెం, మార్చి 4: మండలంలోని పేరలి గ్రామంలో తూర్పు యాదవపాలెంకు చెందిన మద్దిబోయన చిన్న కోటేశ్వరరావు సోమవారం మృతి చెందారు. డాక్టర్ బాలకృష్ణమూర్తి సహకారంతో పేరలి నరసయ్య చారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో కాగిత బుల్లియ్య, గొర్రెముచ్చు మీరయ్య, పేరలి శ్రీనివాసరావు, గేరా ఏసుబాబు, మద్దిబోయన శివరావు చేతులమీదగా మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5వేలు ఇచ్చినట్లు ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కాటూరి ప్రసాద్, బొలగాని వెంకటేశ్వర్లు, కర్రి ముక్కంటి, నాదేళ్ళ బాబురావు, సలగల దావీదు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసు కొట్టివేత

భట్టిప్రోలు, మార్చి 4: తనపై అక్రమంగా పెట్టిన ఎస్సీ ఎస్టీ కేసు సాక్ష్యాధారాలు లేనందున కొట్టివేస్తూ జడ్జి తీర్పును ఇచ్చినట్లు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 2017లో గ్రామ సర్పంచ్ కంభం మరియమ్మ కులం పేరుతో దూషించారంటూ ఉప సర్పంచ్‌గా ఉన్న తనతో పాటుగా వార్డు సభ్యులు కొన్నిపాటి లోకానంద్, డొక్కు పోతురాజులపై స్థానిక స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. సదరు ఫిర్యాదు మేరకు విచారణ అనంతరం 2018లో పోలీస్ అధికారులు కేసును తీసివేయగా మరలా 2018లోనే మరియమ్మ గుంటూరు నాల్గవ అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో ప్రైవేటు ఫిర్యాదును దాఖలు చేసినట్లు ఆయన తెలిపారు. సాక్షులను విచారించి ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కులదూషణ జరగలేదని నమ్మిన న్యాయమూర్తి సదరు కేసును కొట్టివేస్తూ సోమవారం తీర్పును వెలువరించినట్లు సాయిబాబా చెప్పారు.

స్పందన అర్జీలు పరిష్కరించాలి

జేసీ శ్రీధర్



జేసీ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

బాపట్ల, మార్చి 4: స్పందన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన అర్జీదారుల సమస్యలను అడిగి తెలుసుకున్న వాటిని ఆయా శాఖల అధికారులకు అందించారు. స్పందన అర్జీలు పెండింగ్‌లో ఉండరాదని చెప్పారు. పెండింగ్ అర్జీలపై ఆరా తీశారు. మిచౌంగ్‌తుఫాన్‌కు దెబ్బతిన్న పంటలకు ఈనెల 6వ తేదీన నష్టపరిహారం పంపిణీ జరగనుందన్నారు. పల్స్‌పోలియో చుక్కల మందు కార్యక్రమం నూరుశాతం లక్ష్యాలు చేరుకునేలా పర్యవేక్షించాలన్నారు. నిర్మాణాలు పూర్తిచేసిన 18 గ్రామసచివాలయాలు, 10 ఆర్బీకేలు, 7 ఆరోగ్య కేంద్రాల భవనాలను వారంలోగా ప్రారంభించాలని ఆయన తెలిపారు. ఉపాధి పథకం పనులు లక్ష్యం మేరకు పూర్తయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో సి.హెచ్.సత్తిబాబు, ఆర్డీవో గంధం రవీందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సాగునీటి కోసం డబ్బు తీసుకున్నారు...

బాపట్లరూరల్: సాగునీటి కోసం రైతుల నుండి డబ్బు వసూలు చేశారంటూ పర్చూరు మండలం బోడవాడ మందగుంటకు చెందిన రైతు చెరుకూరి సురేష్‌బాబు సోమవారం కలెక్టరేట్ స్పందనలో వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ తమ గ్రామంలో సర్వేనెం.30/20లో 24ఎకరాల 80సెంట్లలో వజ్జలకుంట చెరువు ఉన్నదన్నారు. ఈ చెరువు ద్వారా తమ తాతముత్తాతల నుండి సమీప పంట పొలాలకు సాగునీటిని పెట్టుకుంటున్నామన్నారు. గత 5 సంవత్సరాలుగా ఈ చెరువు ధర్మాదాయశాఖ పాలన కిందకు మార్చారు. ఈ చెరువుకు నూతనంగా సింగిల్‌ట్రస్టీగా గుండపనేని కోటేశ్వరరావుని నియమించారన్నారు.ఈవ్యక్తి చెరువు ద్వారా పంటపొలాలకు నీరు అందించాలంటే ఎకరానికి రూ.1000 చొప్పున దాదాపు 500 ఎకరాలకు డబ్బు వసూలు చేసి రసీదు ఇవ్వలేదని తెలిపారు. ఆ డబ్బుకు లెక్క చెప్పడం లేదన్నారు. సదరు వ్యక్తిపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఇంటిపన్ను కట్టించుకోవటం లేదు..

తన స్థలానికి పంచాయతీ అధికారులు పన్ను కట్టించుకోవటం లేదని, వేరొకరి పేరుతో పన్ను కట్టించుకున్నారంటూ అమృతలూరు మండలం కోరుతాడిపర్రు గ్రామానికి చెందిన మాజేటి శంకర్‌కుమార్ వినతిపత్రాన్ని అందజేశారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తాను కొన్న 363 చదరపు గజాల స్థలానికి గట్టు పున్నారావు అనే వ్యక్తి పంచాయతీ అధికారులతో కుమ్మక్కై స్థలం పన్ను రసీదును తన పేరు మీద తీసుకున్నాడన్నారు. తాను కొన్న స్థలానికి సంబంధించి డాక్యుమెంట్‌లను అధికారులకు చూపించినా పన్ను కట్టించుకోవడం లేదన్నారు. తనకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను వేడుకున్నారు.

దివ్యాంగురాలి సమస్యపై స్పందించిన ఎస్పీ



దివ్యాంగురాలి నుంచి అర్జీ స్వీకరిస్తున్న ఎస్పీ వకుల్‌జిందాల్, విలపిస్తున్న దివ్యాంగురాలు

బాపట్ల, మార్చి 4: సమస్య పరిష్కరించాలని కోరుతూ జిల్లా పోలీసు కార్యాలయానికి విచ్చేసిన దివ్యాంగురాలి సమస్యపై ఎస్పీ వకుల్‌జిందాల్ స్పందించారు. సోమవారం దివ్యాంగురాలు రావటాన్ని గుర్తించిన ఎస్పీ నేరుగా ఆమె వద్దకొచ్చి అర్జీ స్వీకరించి సమస్య అడిగి తెలుసుకున్నారు. చీరాల మండలం పిట్టువారిపాలెం గ్రామానికి పిట్టు మల్లేశ్వరి పుట్టుకతోనే దివ్యాంగురాలు. తల్లిదండ్రులు చనిపోవటంతో ఒంటరిగా ఉంటున్న ఆమె పెన్షన్ డబ్బులు, దాచుకున్నవి రూ.3లక్షలతోపాటు మరొకరి వద్ద రూ.2లక్షలు అప్పు తీసుకొని మొత్తం రూ.5లక్షలు అదే గ్రామానికి చెందిన పిట్టు గోపికృష్ణకు వడ్డీకి ఇచ్చింది. మూడు సంవత్సరాలుగా డబ్బులివ్వకుండా గోపికృష్ణ ఇబ్బంది పెడుతూ నోటు సమయం అయిపోయింది కాబట్టి ఇవ్వనటంతో ఎస్పీని ఆశ్రయించి న్యాయం చేయాలని కన్నీరు పెట్టుకుంది. వెంటనే సంబంధిత అధికారులను సమస్యను పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు. అదేవిధంగా సోమవారం జరిగిన స్పందనలో జిల్లా నలుమూలల నుంచి సమస్యల పరిష్కారం కోసం 56మంది ఫిర్యాదులు చేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్, స్పందనసెల్ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్. సింగయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతి చంద్రబాబుతోనే సాధ్యం



రేపల్లె 13వ వార్డులో బాబూ ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో మహిళలకు కరపత్రాలను అందిస్తున్న టీడీపీ నాయకులు

రేపల్లె, మార్చి 4: రాష్ట్రంలో మహిళల భవిష్యత్తుకు భరోసానుఇస్తూ వారి అభివృద్ధికి తోడ్పాటును అందించేది చంద్రబాబేనని టీడీపీ పట్టణాధ్యక్షుడు గోగినేని పట్టాభిరామారావు అన్నారు. సోమవారం పట్టణంలోని 13వవార్డులో బాబూ ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ ముగింపు సందర్భంగా ఇంటింటికి కరపత్రాలను అందించి సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు స్వయంశక్తితో ఆర్థికంగా నిలబడాలని ఆలోచించే మహిళా పక్షపాతి చంద్రబాబు అన్నారు. బాపట్ల జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి తాతా ఏడుకొండలు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అనగానికి ప్రతి ఒక్కరూ అండగా ఉండి వారి విజయానికి కృషి చెయ్యాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పంతాని సాయికుమార్, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, దాసరి అమర్‌నాథ్, కేసన రామకృష్ణ, దేవగిరి రంగా, ఆగస్టీన్, దున్నా జయప్రద, యరగళ్ళ శ్రీనివాసరావు, కేసన కృష్ణారావు, సజ్జా ప్రసాద్, షేక్ ఖాదర్‌బాషా, నాగశ్రీ, పి.లక్ష్మీనరసింహ, జనసేన పట్టణాధ్యక్షుడు రాసంశెట్టి మహేష్, దేవగిరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీలు అభివృద్ధి చెందాలంటే టీడీపీ రావాలి



చెరుకుపల్లి ఎస్సీ కాలనీలో బాబూ ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంనిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

చెరుకుపల్లి, మార్చి 4: ఎస్సీ, ఎస్టీ కాలనీలు అభివృద్ధి చెందాలంటే టీడీపీ ప్రభుత్వం రావాలని నియోజకవర్గ పొలిటికల్ మేనేజర్ పూషడపు కుమారస్వామి అన్నారు. సోమవారం మండలంలోని గూడవల్లి, చెరుకుపల్లి గ్రామాలలో జరుగుతున్న బాబూ ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజలు అభివృద్ధి కోరుకుని రానున్న ఎన్నికలలో టీడీపీ, జనసేనలకు మద్దతు పలికి చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ, క్లస్టర్ ఇన్‌చార్జులు ముఖమాటం రాధాకృష్ణమూర్తి, ఉయ్యూరు శివ, టీడీపీ నాయకులు సీతారామయ్య, నాగుల పున్నారావు, కందుల వెంకటేశ్వరరావు, ఏనుగుల కోటేశ్వరరావు, రామసుబ్బారెడ్డి, జనసేన మండల అధ్యక్షుడు దూళ్ళ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జయహో బీసీ సభను విజయవంతం చెయ్యాలి

రేపల్లె, మార్చి 4: బీసీల అభ్యున్నతి కోసం ఒక్క టీడీపీ మాత్రమే కృషి చేస్తుందని బీసీ నాయకుడు, బాపట్ల జిల్లా టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి తాతా ఏడుకొండలు అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మంగళగిరిలో మంగళవారం జరిగే జయహో బీసీగర్జన సభలో నియోజకవర్గంలోని బీసీ నాయకులంతా పాల్గొని జయప్రదం చెయ్యాలని కోరారు. బీసీల సంక్షేమం కోసం అనేక నూతన విధానాలను తీసుకువచ్చి ఆర్థికంగా అభివృద్ధి చెందే దిశగా బీసీలకు టీడీపీ హయాంలో పెద్ద పీట వేశారన్నారు. నియోజకవర్గంలోని బీసీ నాయకులంతా సభలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కేసన రామకృష్ణ, యరగళ్ళ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● చెరుకుపల్లి: బడుగు, బలహీన వర్గాల ప్రజలకు రాజకీయంగా గుర్తింపును ఇచ్చింది టీడీపీనే అని జిల్లా చేనేత సంఘ టీడీపీ నాయకులు దివి రాంబాబు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ బీసీల సంక్షేమమే ధ్యేయంగా టీడీపీ పనిచేస్తుందన్నారు. మంగళవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా జరిగే జయహో బీసీ సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. బీసీలు అధిక సంఖ్యలో పాల్గొనాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ నాయకులు ఉప్పాల సాంబశివరావు, కందుల వెంకటేశ్వరరావు, దివి శ్రీనివాసరావు, కాటూరి నాగేశ్వరరావు, రమణ, నాగుల పున్నారావు, పులి శ్రీనివాసరావు, మెర సీతారామయ్య, ఈవూరి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు మూడు అర్జీలు



ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రాన్ని అందిస్తున్న గ్రామస్తులు

రేపల్లె, మార్చి 4: స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డివిజనల్ అడ్మినిస్ట్రేట్ ఆఫీసర్ సీహెచ్ పద్మావతి అన్నారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో మూడు అర్జీలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ పరిధిలో 19వ వార్డులో మురుగునీటి సమస్యను పరిష్కరించాలని, 5వ వార్డులో ఆర్బీకే మంజూరు, రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చెయ్యాలని అర్జీ దాఖలు చేసుకున్నారన్నారు. పిరాట్లంక, చెన్నుపల్లివారిపాలెం, గంగడిపాలెం, లంకెవానిదిబ్బ, రాజుకాల్వ గ్రామాల్లో తాగునీటి సమస్య, పశువుల తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నామని, తక్షణమే తాగునీటి చెరువులకు, తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ సమస్యను ఆయా శాఖల అధికారులకు పంపి పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు.

తాగునీటికి తప్పని తిప్పలు

అమృతలూరు, మార్చి 4: ప్రతి ఏటా మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా కృష్ణా పశ్చిమ డెల్టా తూర్పు ప్రధాన కాల్వకు నీటి విడుదల చేస్తుంటారు. ఈ ఏడాది కాల్వలకు నీటి విడుదల ఉండదని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ఉత్సవాలకు రైతులు, పశు యజమానులు తమ పశువులను ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయిస్తుంటారు. ఈ ఏడాది నీటి విడుదల లేకపోవడంతో పశువులకు నీటికోసం ఇబ్బందులు తప్పేలా లేవు.

పంట నమోదు జాబితాల విడుదల

నగరం, మార్చి 4: మండలంలోని ధూళిపూడి, అద్దంకివారిపాలెం రైతు భరోసా కేంద్రాల్లో సోషల్ ఆడిట్ కొరకు పంట నమోదు జాబితాలు రైతులు కొరకు ప్రదర్శిస్తున్నామని మండల ఏవో వేము రమేష్‌బాబు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పంట నమోదు చేసుకున్న రైతులు, వారి వివరాలు సరిచూసుకుని తప్పులు ఉంటే రైతు ఆర్బీకేలోని వ్యవసాయ సహాయకులకు తెలిపి సరిచేసుకోవాలని సూచించారు. ఆర్బీకే వద్ద పంట నమోదు వివరాలు సామాజిక తనిఖీ నిమిత్తం జాబితాలను ప్రదర్శించి గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంకొల్లు రామకృష్ణ, కె.హేమామృత, వ్యవసాయ విస్తరణాధికారి కె.నాగ శ్రీనివాసరావు, కె.నాగవీరవరప్రసాద్, కె.భూదేవి, కె.వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలకు 11 వీల్‌చైర్లు అందజేసిన రోటరీ క్లబ్

భట్టిప్రోలు, మార్చి 4: భట్టిప్రోలు, వెల్లటూరు పీహెచ్‌సీలకు రోటరీ క్లబ్ రూరల్ సంస్థ రేపల్లె ఆధ్వర్యంలో 11 వీల్ ఛైర్లను అందజేశారు. రూ.75వేల విలువైన వీల్‌ఛైర్లను నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వరికూటి అశోక్‌బాబు, బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ దేవినేని మల్లికార్జునరావుల చేతులమీదుగా సోమవారం స్థానిక పీహెచ్‌సీలో జరిగిన కార్యక్రమంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దారా రవికిరణ్మయి, ఎంపీపీ డి.లలితకుమారి, జడ్పీటీసీ సభ్యురాలు టి.ఉదయభాస్కరి, వైస్ ఎంపీపీ కె.పిచ్చియ్యశాస్త్రి, రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఎంఎం సక్సేనా, సభ్యులు సాయేశ్వరరావు, పీవీ నాగమల్లేశ్వరరావు, గొట్టుముక్కల బాపారావు, వేములపల్లి రాఘవేంద్రరావు, గోవర్ధనగిరి చినబుజ్జి, కృష్ణమూర్తి, వైద్యులు సిహెచ్ రామకృష్ణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



చర్చిలో ఆశీర్వచనం పొందుతున్న మాజీ మంత్రి ఆనందబాబు, జనసేన నాయకుడు వెంకటకృష్ణ

బైబిల్‌ను అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేస్తున్నారు

మాజీ మంత్రి నక్కా ఆనందబాబు

కొల్లూరు, మార్చి 4: క్రైస్తవ మతాన్ని, బైబిల్‌ను అడ్డం పెట్టుకుని అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం, క్రైస్తవానికి ఈ నాలుగున్నరేళ్లలో ఏ మంచి పనీ చేయలేదంటూ మాజీ మంత్రి నక్కా ఆనందబాబు విమర్శించారు. సోమవారం మండలంలోని దోనేపూడిలో ప్రార్థనా మందిరంలో కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పాస్టర్స్ ఫెలోషిప్ ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనల్లో దైవసేవకుల ఆశీర్వాదం పొందారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గతంలో ఏ రాజకీయ పార్టీ కూడా ఈ రకంగా క్రైస్తవాన్ని అడ్డం పెట్టుకున్న దాఖలాలు లేవన్నారు. టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు ఎటువంటి హామీలు ఇవ్వకపోయినా చర్చిల నిర్మాణానికి ఆర్థిక సహాయం చేశారన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కమ్యూనిటీ హాల్స్ కూడా నిర్మించారన్నారు. క్రైస్తవులతో పాటు అన్ని వర్గాల ప్రజలు ఈ ప్రభుత్వం వల్ల పడిన బాధలకు విసిగిపోయారని అన్నారు. టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో అక్రమార్కుల ప్రభుత్వాన్ని ఇంటికి పంపించేందుకు, టీడీపీ, జనసేన ప్రభుత్వానికి పట్టం కట్టేందుకు ప్రజలు సుముఖంగా ఉన్నారన్నారు. ప్రత్యేక ప్రార్థనల్లో అవనిగడ్డ నియోజకవర్గ జనసేన నాయకులు మాదివాడ వెంకటకృష్ణ, ఫెలోషిప్ ప్రతినిధులు పాల్గొన్నారు.

జూనియర్ ఇంటర్ ఆంగ్ల పరీక్షకు 94.28శాతం హాజరు

బాపట్లటౌన్, మార్చి 4: జూనియర్ ఇంటర్ ఆంగ్లపరీక్షకు సోమవారం జిల్లాలో 35 పరీక్షా కేంద్రాలలో 10025మందికి గాను 9452 హాజరయ్యారు. ఒకేషనల్‌లో 514మంది విద్యార్థులకు 451మంది హాజరయ్యారు. మొత్తంగా 35 కేంద్రాలలో జిల్లాలో 94.28 హాజరు నమోదైంది. అద్దంకిలో ఓ విద్యార్థిపై మాల్‌ప్రాక్టీస్ కేసు నమోదుచేసినట్లు ఇంటర్ జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి పి.యర్రయ్య తెలిపారు. కాగా ఇంటర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థులు పరీక్షకు వెళ్ళే సమయంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

వేమూరులో 14మంది గైర్హాజరు

వేమూరు, మార్చి 4: వేమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం జరిగిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఇంగ్లీషు పరీక్షకు 14మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్, ఒకేషనల్ కోర్సుకు సంబంధించి 179మంది హాజరుకావాల్సి ఉండగా 155మంది హాజరయ్యారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పీఆర్కే పరామర్శ

బాపట్ల, మార్చి 4: మండలంలోని ఈతేరు గ్రామం వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో మృతి చెందిన గన్‌మెన్ శవనం గోపిరెడ్డి కుటుంబాన్ని మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోమవారం పరామర్శించారు. గోపిరెడ్డి మృతికి సంతాపం ప్రకటించి కుటుంబసభ్యులకు సానుభూతి తెలియజేశారు. మృతుని కుటుంబానికి రూ.5లక్షల ఆర్థికసాయంతోపాటు ఇంటిపట్టా అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీనిచ్చారు.

హైదర్‌పేట వద్ద వాహనాల తనిఖీ

బాపట్లరూరల్, మార్చి 4 : బాపట్ల మండలం హైదర్‌పేట వద్ద బాపట్ల రూరల్ ఎస్సై రవి శంకర్‌రెడ్డి సోమవారం రాత్రి వాహనాల తనిఖీ చేపట్టారు. సరైన వాహన ధ్రువీకరణపత్రాలు లేని వాహనదారులకు చలానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా వాహన ధ్రువీకరణపత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలను వాహనదారులు తప్పనిసరిగా పాటించాలన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని తెలిపారు.

భట్టిప్రోలు తహసీల్దార్‌గా మునిలక్ష్మి

భట్టిప్రోలు, మార్చి 4: భట్టిప్రోలు మండల తహసీల్దార్‌గా ఐ.మునిలక్ష్మి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీలలో భాగంగా పిట్టలవానిపాలెం మండలం నుంచి భట్టిప్రోలుకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న పద్మావతిని రేపల్లె ఆర్డీఓ కార్యాలయానికి బదిలీ చేశారు. తహసీల్దార్ మునిలక్ష్మిని ఎంపీపీ డి.లలితకుమారి మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కె.పిచ్చియ్యశాస్త్రి, ఎంపీటీసీలు, రేషన్ డీలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీలో రాష్ట్రపతి పాలన విధించాలి

భట్టిప్రోలు, మార్చి 4: ఏపీలో రాష్ట్రపతి పాలన విధించాలని సౌత్ ఇండియా కాపు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వేల్పూరి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఏపీ ఆత్మగౌరవ ప్రతీక, ప్రభుత్వ కార్యకలాపాలకు ప్రధాన వేదికగా ఉన్న సచివాలయాన్ని రూ.370 కోట్లకు తాకట్టు పెట్టడం అంటే రాష్ట్రంలో ఉన్న 5 కోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టడమేనని ఆగ్రహం వ్యక్తంచేశారు. తక్షణమే ప్రభుత్వాన్ని రద్దు చేసి రాష్ట్రపతి పాలన విధించాలని ప్రధాన నరేంద్రమోడీకి, రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాసిన లేఖలో విజ్ఞప్తి చేశానన్నారు. విశాఖపట్టణం జిల్లాలో ప్రభుత్వ ఆస్తులు తాకట్టు పెట్టి రూ.25వేల కోట్లు, లిక్కర్ వ్యాపారం నుండి రూ.48వేల కోట్లు అప్పులు తీసుకుని ఏపీని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చారని ఆయన విమర్శించారు. 10 సంవత్సరాల నుండి బెయిల్ మీద ఉండి రాష్ట్రంలో అవినీతి, రాజ్యాంగ ఉల్లంఘన, అక్రమాలకు పాల్పడుతున్న సీఎం జగన్‌రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని శ్రీనివాసరావు కోరారు.

టీడీపీ సీనియర్ నాయకుడికి ఆనందబాబు పరామర్శ

కొల్లూరు, మార్చి 4: టీడీపీ సీనియర్ నాయకుడు వేములపల్లి వెంకటనరసయ్యను మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు సోమవారం పరామర్శించారు. మండలంలోని తడికలపూడి గ్రామానికి చెందిన టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు వేములపల్లి వెంకటనరసయ్య అనారోగ్యంతో బాధపడుతూ గుంటూరులోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఆనందబాబు వైద్యశాలకు వెళ్లి ఆయనను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో వేములపల్లి మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పార్టీకి విధేయుడిగా పనిచేసిన సుదర్శనం

వేమూరు, మార్చి 4: మండలంలోని చంపాడు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు పీకా సుదర్శనం ప్రథమ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సంస్మరణ సభకు హాజరైన మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబు సుదర్శనం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా ఇటీవల మృతిచెందిన వెల్లబాడు గ్రామ మాజీ సర్పంచ్ కంఠంనేని శాంతికుమారి సంస్మరణ కార్యక్రమంలో ఆనంద్‌బాబు పాల్గొని ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన వెంట బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, కొల్లి వెంకటేశ్వరరావు, కోగంటి రాజేష్, పీక రాజు, జనసేన నాయకుడు రాజేష్ పాల్గొన్నారు.

అనగాని గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

రేపల్లె, మార్చి 4: అనగాని గెలుపునకు ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని 40రోజుల పాటు కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచెయ్యాలని ఎమ్మెల్యే సోదరుడు అనగాని శివప్రసాద్ కోరారు. సోమవారం రూరల్ మండలంలోని లంకెవానిదిబ్బ గ్రామంలో బాబూ ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైసీపీ ప్రభుత్వం ప్రలోభాలకు గురిచేస్తూ కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారని వాటిని ప్రజలు తిప్పికొట్టాలన్నారు. మాజీ మండల ఉపాధ్యక్షుడు కొపనాతి రాజశేఖర్ మాట్లాడుతూ ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నా, యువతకు ఉద్యోగాలు కల్పించాలన్నా, పేదవాడు అన్నివిధాలా ఆర్థికంగా బలపడాలన్న టీడీపీ, జనసేన ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పంతాని మురళీధరరావు, పార్టీ మండల అధ్యక్షుడు రేపల్లె రామాంజనేయులు, కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, గుర్రం మురహరిరావు, వడ్డి లక్ష్మోజీ, కమతం శివ, తాతా ఏడుకొండలు, కేసన రామకృష్ణ, యరగళ్ళ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



లంకెవానిదిబ్బ గ్రామంలో కరపత్రాలను అందిస్తున్న టీడీపీ నాయకులు

బీసీల సంక్షేమాన్ని విస్మరించిన వైసీపీ

అద్దంకి, మార్చి 4: వైసీపీ ప్రభుత్వ పాలనలో బీసీలు దారుణంగా మోసపోయారని, బీసీల సంక్షేమ పథకాలను వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఈమేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు గుంటూరు సమీపంలోని నాగార్జున యూనివర్శిటీ ఎదుట నిర్వహించే జయహో బీసీ సభకు అద్దంకి నియోజక వర్గంలోని బీసీలందరూ తరలిరావాలని రవికుమార్ పిలుపునిచ్చారు. టీడీపీ అధికార లోకి రాగానే బీసీలను ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చేయటమే లక్ష్యంగా జయహో బీసీ సభలో బీసీ డిక్లరేషన్‌ను టీడీపీ ప్రకటిస్తుందన్నారు. వైసీపీ ప్రభుత్వం బీసీలకు చేసిన ద్రోహం, మోసాలబారి నుంచి కోలుకొని పూర్వ వైభవం పొందేలా అన్నిరంగాలలో బీసీలు దూసుకుపోయేలా టీడీపీ ప్రోత్సహిస్తుందన్నారు. నియోజకవర్గంలోని బీసీ సోదరులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

శింగరకొండ తిరుణాళ్ల ఏర్పాట్లపై నేడు సమావేశం

అద్దంకి, మార్చి4: శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి, ప్రసన్నాంజనేయస్వామి వార్ల 69వ వార్షిక తిరుణాళ్ళ ఏర్పాట్లపై మంగళవారం సాయంత్రం 3 గంటలకు చీరాల ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి అధ్యక్షతన సమన్వయ సమావేశం జరుగుతుందని ఈవో సుభద్ర తెలిపారు. ఈనెల 23 నుంచి 25 వరకు జరిగే వార్షిక తిరుణాళ్ళ ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులు పాల్గొని చర్చించటం జరుగుతుందన్నారు.

తడుల కోసం తంటాలు

- బెట్టకొచ్చిన మిరప
- పెరుగుతున్న పెట్టుబడులు
- దిగజారుతున్న దిగుబడులు
- నష్టపోతున్న సాగుదారులు



మిర్చికి తడి పెట్టేందుకు ఏర్పాటుచేసిన ఇంజన్

చీరాల, మార్చి 4: మిరప రైతు కంట కన్నీరు ఒలుకుతోంది. పెరిగిన పెట్టుబడులు, తగ్గిన దిగుబడు లు అందుకు కారణం. ప్రస్తుతం మిరప పైరు బెట్టకు వచ్చింది. తడి కోసం సాగుదారులు తంటాలు పడుతు న్నారు. ఆయిల్ ఇంజన్లుతో కాలువల్లో, చెరువుల్లో, కుం టల్లో ఉన్న నీటితో పంటను కాపాడుకునేందుకు భగీర థయత్నం చేస్తున్నారు. ఇదిలాఉంటే ముందస్తుగా కోత కు వచ్చిన కాయల్లో ఎక్కువగా తాలు వస్తోంది. దీంతో వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలను నియంత్రిస్తున్నారు. ప్రస్తుత పెట్టుబడులకు తప్పనిసరి పరిస్థితుల్లో ముందస్తుగా కోసిన కాయలను అయినకాడికి తెగ నమ్ముకోవలసి వస్తోందని సాగుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మిరప సాగుకు సేద్యం ప్రారంభించినప్పటి నుంచి సాగుదారులు ప్రతికూల పరిస్థితులతోనే ప్రయాణం చేస్తున్నారు. తొలుత వరుణుడు ముఖం చాటేశాడు. వర్షాలు సకాలంలో పడలేదు. అరకొర పదనుతోనే మిరప మొక్కలు నాటారు. ఆతరువాత మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో కురిసిన వరుస వర్షాలతో పంట పొలాలు జలమయం అయ్యాయి. అందులో ప్రధానంగా నష్టపోయింది మిరప రైతులే. అనంతరం ఆశించిన చీడ పీడలతో మిర్చి రైతులు మరింత కృంగిపోయారు.

బెట్టకొచ్చిన మిరప చేలు.. తగ్గుతున్న దిగుబడులు

మిచౌంగ్ తుఫాన్ సమయంలో కురిసిన వర్షాలు పైర్లను నిండా ముంచాయి. ఆ తరువాత వానలేదు. ప్రస్తుతం మిరప చేలు బెట్టకు వచ్చాయి. దీంతో అవకాశం ఉన్నవారు కాలువలు, వాగులు, చెరువుల్లో ఉన్న నీటిని ట్రాక్టర్లు, ఆయిల్ ఇంజన్లతో తడి ఇచ్చేందుకు భగీరథయత్నం చేస్తున్నారు. దీంతో పెట్టుబడులు పెరుగుతున్నాయి.. దిగుబడులు తగ్గుతున్నాయని సాగుదారులు చెప్తున్నారు.

పెరిగిన పెట్టుబడులు.. ధరపైనే ఆశ

మిర్చికి ఎకరా కౌలు రూ.30వేలు, దున్నకం రూ.10 వేలు, నారు, కూలీ రూ.30వేలు, ఎరువులు రూ.15 వేలు, సస్యరక్షణ రూ.20వేలు, మందుల వెదలు, పిచికారీ, కలుపుల కూలీ రూ.10వేలు, నీటి తడులకు ఒక్కో తడికి రూ.4వేలు చొప్పున నాలుగు తడులకు రూ.16 వేలు, కాయకోత రూ.25వేలు, కాయలు రవాణా తొక్కుడు కూలీ రూ.4వేలు.. వెరసి ఎకరాకు నికరంగా రూ. 1.60 లక్షలు తగ్గకుండా ఖర్చవుతుంది. కొందరికి రూ.2 లక్షల వరకు కూడా ఖర్చయింది. సొంత చాకిరీ, పెట్టుబడికి వడ్డీ కలపకుండానే ఈ లెక్క. ప్రస్తుతం సరాసరిన ఎకరాకు 10 నుంచి 14 క్వింటాళ్లు మించి దిగుబడులు వచ్చే పరిస్థితి లేదు. ముందస్తుగా వచ్చిన కాయల్లో తాలు అధికంగా ఉంది. దీంతో వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలను నియంత్రిస్తున్నారు. గుంటూరు మిర్చి యార్డులో కూడా తమకు గిట్టుబాటు ధర అందటం లేదని వాపోతున్నారు. ఈక్రమంలో క్వింటా సరాసరి ధర రూ.20వేలు పైచిలుకు ఉంటేనే బయటపడతామని, లేదంటే నష్టాలు తప్పవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం తమ ఆశ అంతా ధర పైనేని చెప్తున్నారు. అందుకనుగుణంగా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

గుండ్లకమ్మలో ఇసుక అక్రమ తవ్వకాలను అరికట్టాలి

అద్దంకి, మార్చి 4: గుండ్లకమ్మ నదిలో ఇసుక అక్రమ తవ్వకాలతో ప్రమాదం పొంచి ఉందని పలుప్రజాసంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్ మహబూబ్ సుభానికి సోమవారం వినతిపత్రం అందజేశారు. గుండ్లకమ్మ బ్రిడ్జి వద్ద ఇసుక తవ్వకాలు చేస్తుండటంతో ఇప్పటికే శిథిలావస్థలో ఉన్న బ్రిడ్జి కూలిపోయే అవకాశం ఉందన్నారు. బ్రిడ్జి కూలితే రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుందన్నారు. వేసవిలో తాగునీటి సమస్య కూడా తలెత్తే ప్రమాదం ఉందన్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టకపోతే న్యాయ స్థానాన్ని ఆశ్రయించాల్సి వస్తుందని అద్దంకి పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు అన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో ప్రజాసంఘాల నేతలు యరమోతు నాగయ్య, సీపీఎం మండల కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు, సీపీఐ మండల నాయకులు కేఎల్డీ ప్రసాద్, చెన్నుపల్లి నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలి

అద్దంకిటౌన్, మార్చి 4: శింగరకొండపాలెం ఎస్టీ కాలనీవాసులకు గతంలో ఇచ్చిన ఇళ్ల స్థలాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. సోమవారం పలువురు ఎస్టీ కాలనీవాసులు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి ఆర్ఐ శంకరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఎస్టీలకు గతంలో ఇచ్చిన ఇళ్ల స్థలాల పట్టాలను గ్రామానికి చెందిన పెత్తందారులు లబ్ధిదారులకు ఇవ్వకుండా వారివద్దే ఉంచుకుని మరొకరికి ఆ పట్టాలను అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారన్నారు. ఇదేమని అడిగితే పోలీస్ కేసు పెట్టి జైలుకు పంపిస్తామని కాలనీ వాసులను బెదిరిస్తున్నారని తెలిపారు. గ్రామంలోని రెవెన్యూ అధికారులు కూడా పెత్తందారులకే మద్దతుగా మాట్లాడుతున్నారని, వెంటనే ఈవిషయంపై అధికారులు విచారించి తగు చర్యలు తీసుకుని ఎస్టీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాలనీ వాసులు కోమరగిరి ప్రమీల, హనుమంతరావు, నాగరాజు, సుబ్బులు, మల్లేశ్వరి, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రేపు ఏలూరి క్యాంపు కార్యాలయంలో మెగా కంటి వైద్య శిబిరం

మార్టూరు, మార్చి 4: ఇసుక దర్శిలోని ఏలూరి క్యాంపు కార్యాలయంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కార్యాలయం ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరి చారిటబుల్ ట్రస్ట్, నోవా అగ్రిటెక్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏలూరి నాగేశ్వరరావు జ్ఞాపకార్థం శంకర కంటి ఆసుపత్రి సహకారంతో కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కంటి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. శిబిరానికి వచ్చేవారు తమ వెంట ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డుల జిరాక్స్ కాపీలను తీసు కురావాలని కోరారు.

టీడీపీతోనే బీసీల అభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

పర్చూరు, మార్చి 4: తెలుగుదేశం పార్టీతోనే బీసీల అభివృద్ధి సాధ్యమని ఆపార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. మంగళవారం తెలుగుదేశం పార్టీ బీసీ సాధికారత కమిటీ ఆధ్వర్యంలో జరగనున్న జయహో బీసీ కార్యక్రమానికి బాపట్ల పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల నుంచి పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. గుంటూరులో జరిగే ఈసభను విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బీసీల అభ్యున్నతికోసం తెలుగుదేశం నిర్వహిస్తున్న జయహో బీసీ సభ చరిత్రలో నిలిచిపో తుందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బీసీలపై కక్షతోనే బీసీ సబ్‌ప్లాన్ ని ధులను పక్కదారి మళ్ళించారని ఆరోపించారు. బీసీల సంక్షేమం, అభివృద్ధి, నిధులపై డిక్లరేషన్ ఇస్తున్న ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అన్న విషయాన్ని గుర్తించాలన్నారు. తెలుగుదేశం పార్టీకి బీసీలు పట్టుకొమ్మలన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకువస్తామని పేర్కొన్నారు. బీసీలకు రాజకీయంగా సముచిత స్థానం కల్పించిన పార్టీ తెలుగుదేశం అని అన్నారు. గుంటూరులోని నాగార్జున యూనివర్శిటీ ఎదురుగా జరిగే సభకు బీసీ సోదరులు తరలివచ్చి సంఘీభావం తెలపాలని ఏలూరి కోరారు.

బీసీ గర్జన సభను విజయవంతం చేయాలి

చినగంజాం, మార్చి 4: గుంటూరులో మంగళవారం జరిగే జయహో బీసీ సభకు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని టీడీపీ జిల్లా బీసీ యాదవ సాధికారిక సమితి కన్వీనర్ నక్కల వీరరాఘవు లు, మండల పార్టీ అధ్యక్షుడు పొద వీరయ్య పిలుపునిచ్చారు. స్థానిక టీడీపీ కార్యాలయ ఆవరణలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి అబ్దుల్‌కలాం అజాద్ అధ్యక్షతన సోమవారం జరిగిన మండల పరిధిలోని బీసీ నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఈ సభలో బీసీ డిక్లరేషన్, బీసీలకు రక్షణ చట్టం అమలు తదితర విషయాలపై వివరించనున్నట్లు వీరరాఘవులు తెలిపారు. సమావేశంలో చినగంజాం సర్పంచ్ రాయని ఆత్మారావు, వాటుపల్లి ఏడుకొండలు, వడ్లమూడి వెంకయ్య, కోకి భాస్కర్‌రెడ్డి, టి.జయరావు, యార్లగడ్డ లక్ష్మీ, పద్మావతి, నరహరి శ్రీనివాసరావు, షేక్ జిలాని, పి.పార్థసారిథి, నాంచార్యులు, బి.పిచ్చియ్య, కె.రామాంజనేయులు, సంఖ్యా శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

అరాచక పాలనకు చరమగీతం పాడాలి



సురేంద్రబాబుకు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయకుమార్

పర్చూరు, మార్చి 4: జనసేన, తెలుగుదేశం పార్టీలు కలసికట్టుగా పనిచేసి అరాచక, నిరంకుశ వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపాలని జనసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి పెద్దపూడి విజయకుమార్ పిలుపు నిచ్చారు. సోమవారం స్థానిక అద్దంకి నాంచారమ్మ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో పలుకుటుంబాలు జనసేనలో చేరాయి. వీరికి విజయకుమార్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్ కోసం ప్రతిఒక్కరూ కృషిచేసి వైసీపీ పాలనకు చరమగీతం పలకాలన్నారు. కార్యక్రమంలో శంకరశెట్టి చిరంజీవి, కారంపూడి సందీప్ తేజ, తులసి చంటి, విన్నకోట అజేయ్, కఠారి సురేంద్రబాబు, తులసి అప్పారావు, రంగిశెట్టి ఆంజనేయులు, నారిశెట్టి మల్లికార్జునరావు, ఒగ్గిశెట్టి నరసింహం, కందనాగ శంకరరావు, కందా సురేంద్రబాబు, బోగాది మోహన్, ఆకుల వెంకటేశ్వరరావు, రంగిశెట్టి మారుతి, రెడ్డెత్తు రాముడు, తులసి నాగు, రంగిశెట్టి సింగయ్య, లడడపాటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులను అన్నివిధాలా ఆదుకుంటాం

చీరాల, మార్చి 4: మత్స్యకారులను అన్నివిధాలా ఆదుకుంటామని, వారి అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య అన్నారు. సోమవారం వాడరేవు మత్స్యకారులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారితో పాటు బోటులో సముద్రంలో కొంతదూరం ప్రయాణంచేసి అక్కడ వారికి ఎదురయ్యే పరిస్థితులను తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాలకు అవార్డు



అవార్డు సర్టిఫికెట్‌ను చూపుతున్న కళాశాల ప్రతినిధులు

చీరాల, మార్చి 4: సెయింట్‌ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాలకు ఏఐ ఎడ్యుకేషన్ ఔట్ రీచ్ చాంపియన్‌షిప్ అవార్డు దక్కినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో సీఎంఆర్ టెక్నికల్ కంపెనీలో నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవంలో సెయింట్‌ఆన్స్‌కు అవార్డు అందినట్లు తెలిపారు. ఈసందర్భంగా సోమవారం కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వివరాలు వెల్లడించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మొయిద వేణుగోపాలరావు, అక్రిడే షన్స్ మేనేజర్ డాక్టర్ సి.సుబ్బారావు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, పాల్గొన్నారు.

నాడు - నేడు పనులను పరిశీలించిన ఎంఈవో

మార్టూరు, మార్చి 4: మార్టూరు విజయనగర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలను సోమవారం మండల విద్యాశాఖాధికారి ఎం.వస్రాం నాయక్ పరిశీలించారు. ఈసందర్భంగా పాఠశాలలో జరుగుతున్న నాడు - నేడు పనులను ఆయన పరిశీలించారు. ఇంకా పూర్తిచేయని పనులను త్వరితంగా పూర్తిచేయాలని కోరారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి ఆహారం నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

తాడిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతి

చీరాల టౌన్, మార్చి 4: తాడి చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు జారిపడి గీత కార్మికుడు పిట్టు వెంకటేశ్వర్లు(52) రెండురోజుల క్రితం మృతిచెందాడు. ఈఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కల్లు గీసేందుకు చెట్టు ఎక్కి దిగేక్రమంలో ప్రమాదం జరిగినట్లు తెలస్తుంది. ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు సంతానం.

రాష్ట్రస్థాయి పోటీకి ఎంపికైన ప్రాజెక్టు

ఇంకొల్లు, మార్చి 4: బాపట్లలోని ఏబీఎం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఎంటర్ ప్రన్యూరియల్ మైండ్ డెవలప్‌మెంట్ జిల్లాస్థాయి ప్రాజెక్టు ప్రదర్శనలో 11 ప్రాజెక్టులు ప్రదర్శించారు. ఇంకొల్లు ఎస్ఆర్‌వీఎస్ఆర్ బాలికోన్నత పాఠశాలకు చెందిన జి.శృతి, వై.ఇందిర రూపొందించిన మొరింగాకారం ప్రాజెక్టుకు ద్వితీయ బహుమతి లభించింది. విజయవాడలో ఈనెల 6న జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఈ ప్రాజెక్టు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు ఉదయకుమారి తెలిపారు. ప్రాజెక్టు గైడ్ టీచర్ నాగేశ్వరి, విద్యార్థినులు శృతి, ఇందిరను ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు. ప్రాజెక్టు ప్రదర్శించిన శృతి, ఇందిరకు బాపట్ల జిల్లా విద్యాశాఖాధికారి కె.నారాయణరావు బహుమతి ప్రదానం చేశారు.

పల్స్ పోలియో వందశాతం పూర్తిచేయాలి

అద్దంకిటౌన్, మార్చి 4: ఐదు సంవత్సరాలలోపు చిన్నారులందరికి వంద శాతం పల్స్ పోలియో చుక్కలు వేయడమే లక్ష్యంగా పని చేయాలని రాష్ట్ర పల్స్ పోలియో ప్రోగ్రాం ఆఫీసర్ రామారావు అన్నారు. సోమవారం అద్దంకి వచ్చిన ఆయన పట్టణంలోని యూపీహెచ్‌సీ కాకానిపాలెం, గాజులపాలెంను సందర్శించారు. ఇప్పటివరకు జరిగిన పల్స్ పోలియో కార్యక్రమం వివరాలను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే, పట్టణంలోని పలు గృహాలను సందర్శించి ఆ గృహాలలో ఉన్న ఐదు సంవ త్సరాలలోపు చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేశారా లేదా అని చిన్నారులకు చేతులపై పెట్టిన ఇంకు మార్కును పరిశీలించారు. అలాగే, రెండురోజుల ఇంటింటి సర్వేలో భాగంగా గోడలపై వైద్య సిబ్బంది వేసిన సర్వే నెంబర్లను పరిశీలించారు. కాకానిపాలెం యూపీహెచ్‌సీ నూతన భవనం నిర్మాణం గరటయ్య కాలనీలో అసంపూర్తిగా ఉండడాన్ని పరిశీలించారు. వెంటనే పనులు ప్రారంభించి భవనం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, డాక్టర్ నవ్యారెడ్డి, డాక్టర్ హేమమాధురి, డాక్టర్ జి.జయసింహ, డాక్టర్ మనోజ్ తదితరులు పాల్గొన్నారు.